# ఆదికవి వాల్మీకి

(రంకాల నాటకం)

బోయి భీమన్న

సన్మాన సంఘం

మొదటి ముద్రణ
1970

లలితా ప్రెస్
ఖైరతాబాద్

హక్కులు రచయితవి

మూల్యం: 2

ప్రతులకు:
సుఖేలా నికేతన్
ఐ.సి. 85, ఇర్రం మంజిల్ కాలనీ
హైదరాబాద్-4

# ఆముఖం

భారత జాతికి జాతీయ కవులు ముగ్గురు - వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసు.

కృతయుగం శ్రుతి ప్రధానం, కవితకు శ్రుతులే బీజక్షేత్రాలు.

త్రేతాయుగానికి వాల్మీకి, ద్వాపరయుగానికి వ్యాసుడు, కలియుగానికి కాళిదాసు కవి బ్రహ్మలు. వేద క్షేత్రంలో పుట్టి, పెరిగి, వికసించి, ఫలించి, మానవచేతనను ఆనంద రసప్లావితం చేసిన రస బ్రహ్మలు వారు.

రసో వైసః

ఈ ముగ్గురు కవిబ్రహ్మలూ ఎవరు?

అర్థంలేని ప్రశ్న! కదూ?

అయితే - ఈనాడు అర్థం దేనికుంది?

ఈనాడు మాటకు అర్థంలేదు. అర్థానికి విలువ లేదు, విలువకు పరిగణన లేదు. అందుకే ఈ ప్రశ్న అడుగుతున్నాను. ఈ ముగ్గురు కవి బ్రహ్మలూ ఎవరు?

ఈ ముగ్గురూ గిరిజన, హరిజన, బహుజన కులాలకు చెందినవారే కాదా?

ఋషి మూలం, నది మూలం వెతకవద్దన్నారు పెద్దలు. సరే, వెతికితే ఏమవుతుంది?

ఏమవుతుంది? ఈనాటి ఛాందసుల, పండితుల, కులతత్వవాదుల కుతర్కంలోని కౌటిల్యం బైటపడుతుంది!

అంటరాని వాడుగా అవమానించబడుతున్న ఒక హరిజన యువ రచయిత - ఈనాడు - ఈ 1970వ సంవత్సరంలో - ఈ భాగ్యనగరంలో నిలబడి, వెనక్కి తిరిగి ద్వాపరంలోకి, త్రేతాయుగంలోకి తన వంశవృక్షాన్ని అవరోహిస్తూపోతే, ఎక్కడికి చేరతాడు? మూలం ఏది? బీజం ఎక్కడ?

బీజం ఆర్షం, మూలం వాల్మీకం, కాండం వ్యాసం, శాఖలు కాళిదాసం కాదా? కాదనగలవాడెవడైనా ఉన్నాడా?

ఈ విషయాన్ని కూలంకషంగా పరిశోధించే - హరిజనులు ఆర్యులే అన్నాను. హరిజనులది ఋషుల వంశమే అన్నాను. ఈ దేశంలో హరిజనులకూ, హరిజనేతరులకూ జాతిభేదం లేనేలేదన్నాను.

రాగవాసిష్ఠం (అరుంధతీ కల్యాణం), ఆదికవి వాల్మీకి, వేదవ్యాసుడు, ధర్మ వ్యాధుడు ఈ నాలుగు నాటకాలనూ నేను వ్రాయటం హరిజనులు ఆర్యులే అని ఋజువు చెయ్యడానికే. అందుకు బాహ్య (చారిత్రక) సాక్ష్యాలనూ, ఆంతరంగిక (పురాణగత) సాక్ష్యాలనూ కూడ విశేషంగా చూపాను. ఇంకా పరిశోధించేకొలదీ అందుకు సాక్ష్యాలు కుప్పతెప్పలుగా లభించగలవు. ఆత్మవంచన విడిచిపెట్టి, అభిజ్ఞులైన పండితులు ప్రయత్నించండి!

## 2

1931-32 ప్రాంతంలో కాబోలు - బి.ఎస్.మూర్తిగారు "ఆరు కోట్ల తిరుగుబాటు" అనే పద్యకావ్యాన్ని వ్రాశారు. దాన్ని ఉంద్రు సుబ్బారావుగారు అచ్చు వేశారు.

ఆరుకోట్ల మంది (1931 సెన్ససు లెక్కల ప్రకారం) హరిజనులు తమ హక్కుల కోసం పోరాడడం ఆ కావ్యంలోని ఇతివృత్తం.

అయితే - ఆ పద్యాలనుగాని, ఆ అచ్చు పుస్తకాలనుగాని చూచిన వారెవరూ లేరు. వ్రాశామని మూర్తిగారు చెప్పేవారు. అచ్చువేశామని సుబ్బారావుగారు చెప్పేవారు. అంతే.

ఒకప్రక్క గాంధీజీ, మరోప్రక్క అంబేద్కర్‌జీ హరిజనోద్యమ రంగంలో పోరాడుకొంటున్న రోజులవి. స్థానికంగా ఉంద్రు సుబ్బారావు, చినవెంకటరెడ్డి, జొన్నల మోహనరావు, బళ్ళ పురుషోత్తం, పాముల ప్రకాశరావు, నరసింహారావు మొదలైన వాళ్ళం ఆ రోజుల్లో ఒక జట్టుగా బైలుదేరి హరిజన పేటల్లో ప్రచారం చేస్తుండేవాళ్ళం.

అప్పటికి నేను ఇంటర్ చదువుతుండే వాణ్ని.

హరిజనులెవరు? అంటరానితనం ఎందుకు వచ్చింది? మొదలైన విషయాలను గురించి మా ప్రచారం కోసం వివరాలు కావలసి వచ్చి, అవి ఎక్కడా దొరక్క, నేనే సొంతంగా ఒక సిద్ధాంతాన్ని రూపొందించాను. దాని ప్రకారమే మేము ఉపన్యాసాలు దంచుతూ ఉండే వాళ్ళం.

ఆ సిద్ధాంతం ఇది.

1. ఆది భారతీయులు హరిజనులే. హరిజనులే భారతదేశపు తొలి రాజులు.
2. హరిజనులే అసలైన ద్రావిడులు.

3. ఆ తర్వాత ఆర్యులువచ్చి, ద్రావిడుల్ని ఓడించారు.

4. ఓడిన ద్రావిడులలో ఆర్యులకు లొంగిపోయి, వారి ఆజ్ఞలకు తలొగ్గిన వారు శూద్రులైనారు.

5. శూద్రులు కావడానికి ఇష్టంలేనివారు పారిపోయారు. అలా పారిపోయిన వారిలో కొందరు గ్రామం వెలుపలనే ఉండిపోయారు. వారే అస్పృశ్యులుగా చూడబడిన నేటి హరిజనులు.

6. మరికొందరు అడవులలోకి పారిపోయారు. వారే నేటి గిరిజనులు.

7. కాగా – భారతదేశానికి నిజమైన హక్కుదారులు గిరిజనులూ, హరిజనులూను.

ఈ సిద్ధాంతం అప్పట్లో చాల ప్రచారం పొందింది.

అయితే – నేను ఆ తర్వాత చరిత్రను, పురాణాలను, దేవాసుర సంబంధాలను పరిశోధించడం మొదలుపెట్టిన తర్వాత – చిన్నప్పటి ఆ నా సిద్ధాంతాన్ని మార్చుకున్నాను. ఆర్యులూ, ద్రావిడులూ – ఉభయులూ కూడ ఒకే జాతికి చెందిన వారనేది ఇప్పటి నా సిద్ధాంతం.

గిరిజనుడుగా, బోయకులస్థుడుగా ప్రసిద్ధి పొందిన వాల్మీకి మహాకవి మొదట్లో హరిజనుడే అన్న నా సిద్ధాంతానికి ఉపబలంగా మాత్రమే ఈ పై వివరాలను ఇక్కడ పేర్కొన్నారు.

గిరిజనులలో వాల్మీకులు మాలలనీ, అస్పృశ్యులనీ షెడ్యూల్డు తరగతులను గురించి పరిశోధనలు జరిపిన శ్రీ తులాబందుల నాగేశ్వర రావుగారు చెపుతున్నారు. ఈ సత్యం కూడా నా సిద్ధాంతాన్ని బలపరిచేదే.

## 3

సృష్టిస్థితి ప్రణాళికలో – పురాణాల ప్రకారం 14 మన్వంతరాలున్నై. అందులో ఏడోది వైవస్వత మన్వంతరం. ఈ వైవస్వత మన్వంతరం ప్రారంభమయ్యేదాకా – అంటే, ప్రణాళికలో సగం గడిచే దాకా – మానవుడికి గోపోషణ కాని, కృషి కాని, సత్య అసత్య విచక్షణ కాని, లోభమాత్సర్యాలు కాని లేవు. అంటే – అంత సహజంగా, దివ్యంగా మానవుడు జీవిస్తూ ఉండేవాడన్నమాట! బహుశా, ఆనాటి సమాజ వ్యవస్థనే ఆదిమ సమ సమాజం (Primitive Communism) అనవచ్చునేమో.

అదితీ కశ్యపుల కొడుకు వివస్వతుడు. అతడు సూర్యుడు. అతడి భార్య సంజ్ఞ. ఈ ఇద్దరికీ పుట్టినవాడు వైవస్వతుడు. ఇతడు మనువై మానవ సమాజాన్ని శాసించ డానికి పూనుకొన్న నాటి నుంచే, సమాజంలోకి దుష్టస్వార్థం ప్రవేశించిందనవచ్చు.

వైవస్వత మన్వంతరంలో, ముఖ్యమైన ఋషివంశాలలో అత్రి వంశం ఒకటి. ఆ వంశంలో పుట్టినవాడు వేనరాజు.

స్వార్థపరుల చేతిలోపడి సమాజం నాశనం కాకుండా కాపాడడంకోసం వేనుడు ప్రయత్నించడం, హత్య కావించబడడం లోక ప్రసిద్ధమైన విషయమే కదా?

వేనరాజుకు ఇద్దరు కొడుకులు. పెద్దవాడు నిషాదుడు. చిన్నవాడు పృథువు.

నిషాదుడు తండ్రి విధానాలనే అనుసరించడంవల్ల – స్వార్థపరులైన అమా త్యులూ, పురోహితులూ అతణ్ని దేశం నుంచి వెళ్ళగొట్టి, సాధువైన పృథువును సింహా సనం ఎక్కించారు.

ఇదంతా ఎందుకు చెపుతున్నానంటే – దేశ బహిష్కృతుడై, అడవులకు పారి పోయిన ఆ నిషాదుడే పల్లె, బోయ, ఎరుకల వంటి ఆటవిక తెగలకు మూలపురుషు డని బ్రహ్మపురాణం చెపుతున్నది కనుక!

సాంప్రదాయకంగా చెప్పుకోవడాన్ని బట్టి – వాల్మీకి బోయ, నిషాదుడు కదా? అత్రి మహర్షి వంశం వాడే కదా?

కాగా – ఈనాడు ఆదివాసులుగా, గిరిజనులుగా చెప్పబడుతున్న వాళ్లు ఆర్య ఋషుల వంశస్థులే అనడానికి ఇంతకంటె పౌరాణిక నిదర్శనం మరేం కావాలి?

## 4

అత్రి భార్య అనసూయ. ఆమె అరుంధతి అక్క! అనసూయ, అరుంధతి మొదలైన ఏడుగురు అక్కల తర్వాత పుట్టినవాడు కపిల మహర్షి. వేదాంతంలో సాంఖ్య సిద్ధాంతాన్ని ప్రవర్తింపజేసిన వాడు ఈ కపిలుడే.

వీరంతా ఈనాటి హరిజనులకు పితరులే కాదా?

ఆదిమ భాషయై భవన
మంతట రంజిలు దేశభాష యం
దాది మహా కవీంద్రుడయి
ఆది మహా కృతి కర్తయై మహేం
ద్రాది సురార్చితుండగు మ
హా ముని చంద్రుడునైన అమ్మహా
వేద విదుండు వాల్మీకి ప
విత్రుడు మున్ను నిషాదుడే కదా?

(నిరుద్ధ భారతం, పద్యం 12)

నిషాదులు హరిజనులే అనీ, కపిల మహర్షి మాలమాదిగ వాడేననీ నిరుద్ధ భారతం 96వ పద్యం నిరూపిస్తున్నది.

ఎందరు కపిల మునీంద్రులీ మాలల
యం దుద్భవించి పెంపొందువారో!
..........................................
..........................................
ఎంద రెంద రరుంధతు లీ నిషాదు
లం దవతరించి సత్కీర్తి నొందువారో!
ఏపు గననీక మాలల హిందుజాతి
స్వార్థరతి నాత్మనాశంబు సల్పుకొనియె!

అదే విధంగా వాల్మీకి, పరాశరుడు, వేదవ్యాసుడు, శ్రీశుకుడు, సత్యవతి, రోహిదాసుడు, మతంగుడు, కుంతి, రేణుక, పరశురాముడు ఇలా ఎందరెందరో పురాణ పురుషులు, స్త్రీలు హరిజనులని ఎంతో పరిశోధించి స్వర్గీయ మంగిపూడి వేంకటశర్మ గారు నిరుద్ధ భారతంలో నిరూపించి ఉన్నారు. ఈ విషయంలో ఇంకా ఎంతో పరిశోధన జరగవలసి ఉంది కూడ.

పురాణాలన్నీ అనుష్టుప్ ఛందస్సులో వ్రాయబడ్డాయి. అనుష్టుప్ శూద్ర ఛందస్సట. స్త్రీలకోసమూ, శూద్రులకోసమూ, ద్విజ బంధువులకోసమూ, వేదాలు పురాణీకరించబడ్డాయట! కావచ్చు. వేదాలు విభజించిన వ్యాసమహర్షి హరిజనుడు కనుక – తన ప్రజల కోసం వేదసారాన్ని పురాణ కథలుగా వ్రాసి ఉండవచ్చు. చరిత్రలో మొట్టమొదటి ప్రజాకవి వ్యాసుడే కదా? అప్పుడు ద్విజబంధువులు అంటే హరిజనులే అవుతారు. ''చండాలస్తుజనితో బ్రాహ్మణ్యాం వృషలే నయ'' అనే నిర్వచనాన్ని బట్టి హరిజనులు బ్రాహ్మణబంధువులే.

## 5

స్వర్గంలో అప్సరసల దర్శనంవల్ల బ్రహ్మ మనస్సు వికలమై, అందుండి వాల్మీకి పుట్టాడనీ, అన్యాయంగా బ్రహ్మచే శపించబడి చండాలుడైనాడనీ, తర్వాత ఆటవికులలో కలిశాడనీ పురాణగాథ. ఈ గాథనే ఈ నాటక రచనకు పునాదిగా తీసుకున్నాను నేను. అప్సరసలలో ఊర్వశి ఎక్కువ హృదయం కలది కనుక, వాల్మీకి పుట్టుకకు ఆమెనే ప్రధాన హేతువుగా నిర్ణయించాను.

ఎప్పుడు ఏది ఎందుకు జరుగుతుందో ఎవరికీ తెలియదు. సృష్టి అనేక విధాలుగా జరిగింది. పురాణ పురుషులలోను, మహా ఋషులలోను ఎక్కువ భాగం వివాహిత దంపతులకు పుట్టిన వాళ్లు కాదు. ఋషులలో బ్రహ్మలలో అనేకులు మొత్తం మీద హరిజనులే!

''సత్యయుగంబున నొకనాడు బ్రహ్మ స్వర్గమును జూడ వెళ్లెను. వాని కింద్రుడును రంభాది అప్సరసలను ఎదురుగా వెళ్ళిరి. వారిని జూడగా బ్రహ్మకు రేతః పతనమయ్యె. అది కొంత పంకముతో గలిసెను. అందుండియే వాల్మీకి జన్మించెను. అట్లు జన్మించిన వాల్మీకి బ్రహ్మకెదురుగ బోయి, నీ రేతస్సు పంకముతో గలియుటచే నేబుట్టితిని, నా కాహారము సమకూర్చుము అని యడిగెను. తన రహస్యము బైట బెట్టుటచే బ్రహ్మకు కోపము వచ్చి, నీవు పతితుడవు కమ్మని శపించెను... ఆ శాపము వలన వాల్మీకి చండాలురను గలిసి తిరుగుచు, ఒక బోయ కాంతను వివాహమాడెను....''

(పూర్వగాథా లహరి, పేజి 308, 406)

పురాణ ప్రసిద్ధమైన గాథనే తీసుకొని, అనుగుణమైన మార్పులు చేసి, ఈ నాటకాన్ని వ్రాశాను.

ర, మ అనేవి రెండు బీజాక్షరాలు. అవి రెండూ కలిసిందే పూర్ణ చైతన్యధార. అగ్ని బీజాన్ని ద్విగుణీకరించి, 'రామ' శబ్దాన్ని సంపుటీకరించి, ఒక పూర్ణ పురుష మూర్తిని సృష్టిం చాడు బ్రహ్మ. దానికి వాల్మీకి రూపకల్పన చేశాడు. రామ అనేది ఒక మంత్రం. అది హృదయ పద్మానికి రవి వంటిది. ''కవీంద్రాణాం చేతః కమల వనబాలాతపరుచిం'' అని శంకరాచార్యుడు ఏ శక్తిని సంభావించి పలికాడో, అది ఈ ''రామ'' మంత్రస్థమైన శక్తే. రామ మంత్రమే రామాయణంగా వికసించింది.

(అలానే కామ బీజాన్ని ద్విగుణీకరిస్తే ''రమా'' అవుతుంది. అదే శక్తి.)

సార్వజనిక శ్రేయోజీవన పథకానికి విరుద్ధమైన దేదీ రామాయణంలో ఉండదు. ఉంటే అట్టిది ప్రక్షిప్తమై ఉంటుందే కాని, వాల్మీకిది కావడానికి వీలు లేదు. తాను నిషా దుడై ఉండి కూడ, ఒక నిషాదుడి క్రూర కృత్యాన్ని సహించలేక శపించగలిగిన పర మర్షి వాల్మీకి. అతని రచనలో జాతి, కుల, వర్గ, పక్షపాతం ఉండబోదు.

మన ఆర్యమహర్షుల పుట్టుపూర్వోత్తరాలను ఈ విధంగా నేను ఎత్తి చూపడా నికి కారణం, నేటి హిందూ సమాజం నుంచి కులతత్వాన్ని నిర్మూలించాలన్న నా ఆకాంక్ష. భారతీయ సంస్కృతికే మూలపురుషులైన ఋషులంతా ఒక మాదిరిగా హరిజనులే అయినప్పుడు అస్పృశ్యతనూ, కుల వ్యవస్థనూ పట్టుకొని వ్రేలాడడం పాపం కాదా? ఆత్మ ద్రోహం కాదా?

జాతి సమైక్యంకోసం, కులతత్వ నిర్మూలన కోసం నేనీ పరిశోధన అంతా చేస్తు న్నాను. దీనివల్ల ఒక్క ప్రజ్ఞావంతుడు ప్రాభావితుడైనా, నేను ధన్యుణ్నే.

గిరిజనుల కోసం, హరిజనులకోసం వెనుకబడిన వర్గాల కోసం చిన్నప్పటి నుంచీ ఎంతో సేవచేస్తూ వస్తున్న మిత్రులు, శాసన సభ్యులు, ప్రజాబంధు శ్రీ తులాబందుల నాగేశ్వర రావుగారికి ఈ దృశ్య కావ్యాన్ని అంకితమిస్తూన్నాను.

దీని రచన, ముద్రణ విషయాలలో నాకు తోడ్పడిన వారందరికీ, సన్మాన సంఘ కార్యకర్తలకూ వందనా లర్పిస్తున్నాను.

-భీమన్న

అంకితం

# ప్రజాబంధు శ్రీ తులాబందుల నాగేశ్వర రావు గారికి

శ్రీ రమ్యమైన గుంటూరు మండల మంచు
సౌభాగ్య మూర్తిగా జనన మొంది,
తరతరాల్ యుగయుగాల్ తల వంచి మనుచున్న
కూలి వృత్తి కులాల కూడ గట్టి,
అరి భయంకరుని రాయల వంటి కొమరుని
భరతోర్వి యొడిని సౌభద్రు జేసి,
బహుజన సేవ జీవన పరమార్థమై
ఘన సముద్ర గభీర ఘనత గాంచి,

వరలు శ్రీ తులా బందుల వంశ మణికి
ఇద్ధమతి ప్రజాబంధు నాగేశ్వరునికి
మత్కృతి నొసంగు వాడ సంత త్వరంప
రాభి వృద్ధిని కోరి సఖ్యానుదీప్తి.

–భీమన్న

* * *

# ఆదికవి వాల్మీకి

## అంకం ఒకటి

(అది ఒక దుర్గమారణ్యం. వృక్ష లతా గుల్మాదులతో పరమ సంకీర్ణంగా ఉంది. అట్టి మహా గహనంలోకి దిగి వచ్చాడు దేవర్షి నారదుడు. ఉక్కిరి బిక్కిరిగా ఉన్నాడు. లతలను ఒత్తిగించు కొంటూ నడుస్తున్నాడు. అడుగులు బరువుగా పడుతున్నై. గొంతు దాకా విందు గుడిచిన వాడిలా ఆపసోపాలు పడుతున్నాడు. నిట్టూర్పులు విడుస్తున్నాడు. చుట్టూ పరికించి చూస్తున్నాడు. ముందుకు సాగుతున్నాడు. అతని మహతి మ్రోగుతూనే ఏదో రాగాలాపన చేస్తూ ఉంది. అతి గంభీరంగా పరిక్రమిస్తున్నా డతడు. రెండు మూడు సార్లు వాంతి చేసుకోబోయి ఆపుకున్నాడు. ఇక ఆపుకోలేక పోయాడు. "రామ" అనే రెండక్షరాల మాటలను ఠపీ మని బైటికి వెళ్ళగ్రక్కేశాడు – ఆ మూలనే ఉన్న ఒక పెద్ద పుట్ట దగ్గర.)

నారదుడు :

రామ ! రామ ! రామ ! (కొంచెం తేలిక పడి) రామ ! రామ ! రామ ! (నిట్టూర్చి) హమ్మయ్య ! బ్రతికాను ! కడు పుబ్బరం కంటె, మనసుబ్బరం మహా దుర్భరం !

రామ ! రామ ! రామ ! హే, రామ ! ఎంత ఇబ్బంది పెట్టా వయ్యా, ప్రభూ !

రామ అనే రెండు అక్షర మణి బిందువుల్ని నాచేత మ్రింగించి, వాటిని ఇముడ్చుకో మంటే – నా తరమా ?

అవి మనసు కడుపులో ఒకటే త్రిప్పడం ! త్రిప్పి, త్రిప్పి బైటికి వచ్చేసినై !

కాని చిత్రం

నేను గ్రోలినవి రెండే రెండక్షరాలు. ఇప్పుడు నానుంచి బైటికి వస్తున్నవి వేలు ! లక్షలు ! కోట్లు ! అవి రెండూ నాలో చేరి, అసంఖ్యాకంగా పెరిగిపోయి – అక్షయమై పోయినై ! ఓహో –

రామ అనునట్టి రెండక్షరాలు గ్రోలి
అక్ష యాక్షర పరమాత్మ నైతి నేను !
అద్భుత మ్మిది రామ నామామృతమ్ము !
రండు, జనులారా ! క్రోలి, చేకొండు ముక్తి !

(నాలుక కరచుకొని) మరిచాను ! అపరాధం ! ఇక్కడ మనుష్యులెవరూ లేరు కదు!) (చుట్టూ చూచి) బ్రతికాను. ఈ రహస్యం మానవ మాత్రుడికి తెలియగూడదని శ్రీమన్నారాయణమూర్తి గట్టిగా చెప్పాడు కదా !

అవును ! ఇది పరమ రహస్యమే. మానవుడికి – మానవుడికి మాత్రమే కాదు – ఈ సృష్టికే భవిష్యత్తు తెలియగూడదు. తెలిస్తే – అంతా సర్వనాశనం.

అందుకే ఆయన అంత గట్టిగా చెప్పాడు – భవిష్యత్తులో జరుగబోయే తన రామావతార విషయం అతి రహస్యంగా ఉండాలని !

ఈ రహస్యం నా ఒక్కడికే చెప్పాడాయన ! ఎంత ప్రత్యేకత నాది ! ఎంత ధన్యుణ్ని నేను

రామ ! ఎంత మధురాక్షరద్వయం ! ఎంతటి అమృతనామం !

కాని – రహస్యం దాచగలనా నేను ? రహస్యం దాచడమనే దానికంటె కష్టతరమైన కార్యం మరేముంది ?

రహస్యం అంటే ఏమిటి ?

ఎవరికీ తెలియనదీ రహస్యం కాదు. అందరికీ తెలిసిందీ రహస్యం కాదు. ఏదో కొద్దిమందికి తెలిసిందే రహస్యం.

రహస్యం తెలిసినవారి సంఖ్య పెరిగే కొలదీ, రహస్యానికి గిరాకీ పెరుగుతూ ఉంటుంది.

ఈ దివ్య రహస్యం నా కొక్కడికే తెలుసు. మరొక్కరి కైనా తెలియకుండా ఇది రహస్య మెలా అవుతుంది? కనుక, మరెవరికైనా చెప్పక తప్పదు.

నా దగ్గర రహస్యం దాగదని తెలిసి కూడ - దీనిని ఆయన నాకే ఎందుకు చెప్పాలి ? శ్రీ మన్నారాయణమూర్తి కూడ రహస్యం దాచుకోలేదు ! నేను కనిపించాను. నాకు చెప్పేశాడు. అంతే !

లేక - ఇందులో కూడ మళ్ళీ పరమరహస్యం ఏదైనా ఉన్నదో యేమో ! ఏమో ఈ రాజకీయాలు మనకు అర్థం కావు. క్షణక్షణముల్ అధికార్ల చిత్తముల్!

ఏది ఏమైనా దీన్ని ఎవరికీ చెప్పకుండా దాచుకోలేను. మనుష్యలకే కదా చెప్పవద్దన్నది? ఈ చెట్లకు, పిట్లకు, పుట్లకు అన్నిటికీ చెప్పి పారేస్తాను. కడుపు మరీ ఉబ్బిపోతోంది !

మంజు మంజులములౌ
మాధవీ లత లార !
మధుర మధురమ్ము లౌ
మాకంద తరులార !

రాహస్య మొకటి చెపుతా నిందు రండోయి !
రామామృతము పంచుతా నందుకొండోయి !

పుల్ల వల్లీ హృదయ
పుష్పం ధయములార !
వికచ భూరుహ చిత్ర
శుక పికావళులార !

రమ్యాక్ష రానంద రతు లివే నండోయి !
రస భాండములు తెచ్చినా నందుకొండోయి !

విరులార ! గిరులార !
గిర నిర్ఝరములార
మన వహ్నిా శిఖలార !
వల్మీక సఖులార !

రసగంగ దూకుచున్నది లేచి కనుడోయి !
రఘు వంశి పాడ నున్నది లేచి వినుడోయి !

(ఈ విధంగా గానం చేసుకొంటూ, అతడు వనమంతా తిరుగుతాడు. అలా తిరిగే కొలదీ అతడు తేలిక పడుతున్నట్టు కన్పిస్తుంది. కడుపులో త్రిప్పుతున్న రహస్యం బైటికి పోతున్న కొలదీ, అతడు ఆరోగ్యవంతు డవుతున్న లక్షణాలు స్పష్టంగా కనిపిస్తున్నై. అతడు పాడి పాడి, ఆడి ఆడి, ఆనందోత్సాహాలు శిఖరస్థాయిని చేరుకోగా, ఆ వృక్షలతా వల్మీకాదులకు చివరి రహస్యం చెప్పేశాడు –)

**రామ అనునట్టి రమ్యాక్షరములు రెండు**
**ఏమి టనుకొను చుంటిరో యేమొ మీరు ?**
**రాముడై పుట్టనుండె నారాయణుండు.**
**మానవుని దానవుని నుండి మనుచుకొరకు !**

(ఈ పద్యాన్నే మరీ మరీ అంటూ ప్రతి లతనూ, ప్రతి తరువునూ, ప్రతి పుట్టనూ తట్టుతూ పోతాడతడు.)

**రామ అనునట్టి రమ్యాక్షరములు రెండు**
**ఏమి టనుకొనుచుంటిరో ఏమొ మీరు?**
**చివరి రహస్య లవ మిదే చెప్పు చుంటి !**
**మనుజుడు తరించు తెరువు రామ అను మధువు !**

(అక్కడున్న ఒక పుట్ట కన్నంలోకి చూచి – పెద్దగా ఈ రెండు పద్యాలు మరీ గొంతెత్తి పఠించి – నారదుడు నిష్క్రమిస్తాడు. నారదుడు రంగంలోకి ప్రవేశించింది మొదలు, దృశ్యంలోని రకరకాల మార్పుల కొరకు – రకరకాల చెట్లను, పుట్లను చూపడం కొరకు – వెలుగు చీకట్లు అనేక విధాలుగా ఉపయోగిస్తై.)

(నారదుడు నిష్క్రమిస్తూ, అత్యుత్సాహంతో నారాయణ సంకీర్తనం చేస్తాడు–)

నారదుడు

నారాయణ ! నారాయణ ! రామా !
నారాయణ ! శ్రీ రామా !
చెప్పలేదులే రహస్య మెవరికి !
చెట్లు - పుట్లు నీ సేవకులే లే !

నీ నారములే మా క్షీరము లా !
నీవే మా మాతవు, పితవు -
దిగి రమ్మా, మా జగముకు వేగమ !
దివ్యము చేయును, మా భూమి !

లీలగ వికసించిన దీలోకం !
కేలు మోడ్చినది నీకోసం !
పరమ రహస్యం నీ రహస్యమే,
ఎరిగిన వాడే నీ వాడు !

(ఈ విధంగా సంకీర్తనం చేసుకొంటూ - నారదుడు నిష్క్రమించిన తర్వాత - ఒక్క క్షణం సస్పెన్సు. తదుపరి - రంగం మూల గల పెద్ద వల్మీకం (పుట్ట) ఒక బాంబు వలె పగిలిపోతుంది ! పుట్ట గోడలు విరిగి, చెదిరి పడిపోయిన తర్వాత - ఆ పుట్ట మధ్య భాగంలో - ఒక మహా ఋషి యోగ నిద్రలో ఉండి, కనిపిస్తాడు. పుట్ట పగిలిన ధ్వనిలో అతడి తపస్సుకు అంతరాయం ఏర్పడుతుంది. అతడు కళ్లు తెరుస్తూ, మూస్తూ - మ-రా-మ-రామ-రామ-రామ- అంటూ ఉంటాడు ! వల్మీకంలో బైటపడ్డ అతడే వాల్మీకి ! యోగనిద్ర మత్తులో- రామ, రామ, రామ అంటూ - అతడు కొంతసేపు కూర్చుని ఉండి - తర్వాత - అదే నామస్మరణతో లేచి ముందుకు వచ్చి, అంజలి ఘటించి నిలుస్తాడు.)

లోపలినుంచి నేపథ్యవాణి

పుట్టలోనుంచి పుట్టిన అతడు పుట్ట పుట్టువు. వల్మీకంలో నుంచి పుట్టిన అతడు వాల్మీకి. అతడెవరో మహాతపస్వి. అతడు తపస్సులో ఎప్పుడు కూర్చున్నాడో, ఎన్ని వందల వేల సంవత్సరాల క్రితం కూర్చున్నాడో ! అతనిపై పుట్టలు, చెట్టులు మొలిచి ముసలివైనై !

అది మధ్యాహ్న సంధ్య
అతడి తొలి వాక్కు రామ మంత్రం !
అతడి తొలి చూపు చండ భాస్కరుడు !
అతడి తొలి వినుకలి రామ చరిత !
అతడి తొలి పూజ సావిత్రి !
ధన్యుడు కదా వాల్మీకి మహర్షి !

వాల్మీకి

రామ ! (ఆలోచిస్తూ) రామ ! రామ ! (ఆశ్చర్య పడుతూ) ఇంతటి రమణీయాక్షర మధుర సుధా భాండం నా కెక్కడిది?

ఇంతకూ – నే నెవర్ని ?

(తనను తాను చూచుకొని, గడ్డం సవరించుకొని, జటా జూట బంధం తడుముకొని) ఆశ్చర్యం ! ఈ జటా జూటం ముడిచిందెవరో ! అది ఇలానే పెరిగిందో నా పేరేమిటి?

కేవల వల్మీకం నుంచి పుట్టి వచ్చిన నేను వాల్మీకినేనా? నా తల్లీ, తండ్రీ కూడ ఈ వల్మీకమేనా? అవును ! అంతే ! నేను వాల్మీకిని!

గతం ఒక పుట్ట ! దాన్ని ఎందుకు త్రవ్వకోవడం ? ఇప్పుడు చెయ్యవలసిందేమిటి?

రామ ! ఎక్కడిదీ శబ్దసుధ ! ఎక్కడో విన్నట్టుంది. ఏదో తలక్రిందు లైనట్టు తోస్తున్నది !

నా సంస్కారంలో జీర్ణించిపోయిన దేదో తలక్రిందులై - నన్నొక మహాయోగిని చేసినట్టనిపిస్తోంది ! రామా - రా-మా ఇడా పింగళ రూపమైన అర్ధనారీశ్వర తత్వం ఏదో పూర్ణ పురుష ప్రతిష్ఠ కోసం నన్ను మేల్కొల్పినట్టు తోస్తున్నది !

ఏదీ స్పష్టంగా లేదు. స్పష్టతే పరమాత్మ. దాని సాక్షాత్కారం కోసమే తపస్సు. నా తపస్సు ఇంకా ఫలించినట్టు లేదు ! తపస్సును కొనసాగించడమే ఇప్పుడు నా కర్తవ్యం.

(వాల్మీకి మళ్ళీ తపస్సులో కూర్చుంటాడు. అప్పుడు చాల మంది మునికుమారులు వెతుక్కొంటూ ప్రవేశించి ! వాల్మీకిని చూచి, నమస్కరించి, ఆయన చుట్టూ కూర్చుంటారు. కొంత సేపటికి వాల్మీకి కళ్ళు తెరిచి చూచి, ఆశ్చర్యపడి, ప్రశ్నిస్తాడు -)

వాల్మీకి

ఎవరు బాబూ, మీరంతా ?

అందరూ

భరద్వాజ మహర్షుల వారి శిష్యులం !

వాల్మీకి

(ఆలోచిస్తూ) భరద్వాజులు !

అందరూ

ఔను - భరద్వాజులు !

ఒక ధుంబు

వారి ఆశ్రమం ఈ సమీపంలోనే ! వారు మీ శిష్యులు కాగోరి, మీ సేవకు మమ్ము నియోగించారు ! మేమంతా మీ ప్రశిష్యులం ! మీరు చెప్పిన పని చేస్తాం ! చెప్పకపోయినా, మీకు నచ్చిన పని చెయ్యగలం !

వాల్మీకి

(నవ్వుతూ అందరి వంకా చూచి, ధుంబుతో) ఈవానర మూకకు నీవు నాయకుడివా ఏమిటి? (తన మాటకు తానే ఆశ్చర్యపడి) వానర అన్నానేమిటి? ఎక్కడిదో ఈ మాట ! (తమాయించుకొని, ధుంబుతో) నీవొక్కడవూ ఇక్కడ ఉండ (తక్కిన వారితో) బాబూ ! మీరంతా వెళ్ళి - భరద్వాజుల వారినే సేవించండి. వారి దర్శనం కోసం ఉవ్విళ్ళూరుతున్నానని చెప్పండి

తక్కిన అందరూ

చిత్తం (నమస్కరించి, నిష్క్రమిస్తారు.)

వాల్మీకి

రామపాదం ! నీ పేరేమిటి?

ధుంబు

(భక్తితో) నా పేరేదైనా, ఇప్పుడు మీరు పిల్చినదేనా పేరు, గురుదేవా! నా పేరు రామపాదం.

వాల్మీకి

(చిరునవ్వుతో) నా ఊహలు, నా మాటలు ఏమిటో నాకే ఆశ్చర్యం కలిగిస్తూ - అపూర్వంగా ఉన్నై ! సరే. కాని, మీ భరద్వాజ మహర్షుల వారికి నన్ను గురించి ఏమి తెలుసు ? ఎలా తెలుసు ?

రామపాదం

మీ గురించి వారికి భూత భవిష్యద్వర్తమానా లన్నీ తెలుసు. వారు దివ్యాంశ సంభూతులు. దేవగురువైన బృహస్పతుల వారి పుత్రులు. మరుత్తుల శిక్షణలో పెరిగిన మహాత్ములు. అపారశక్తి సంపన్నులు.

వారికి తెలియని దేమీ లేదు. అయినా, మీ ముందు వారు బాలప్రాయులట ! ఆ రహస్య మేమిటో, మీ శక్తి ఏమిటో ఇప్పటి వరకూ వారికి తెలియదట ! వల్మీకం నుంచి మీరు బైటపడ్డ క్షణంలోనే అజ్ఞానం నుంచి వారు బైటపడ్డారట ! అష్టసిద్ధులూ సిద్ధించిన వారికి ఈ నవమాంశ ఏమిటో

ఇదంతా ఏమిటో తికమకగా, తలక్రిందులుగా ఉంది !

వాల్మీకి

(సాలోచనగా) అవును ! అంతా తికమకగా ఉంది ! ఏదో తలక్రిందులైన మాట నిజం !

రామపాదం

ఈ సాయంత్రం వారు మీ గతజీవితాన్ని తమ తపో మహిమచే దర్శించి - మాకు ప్రదర్శించి చూపుతా మన్నారు. ఆశ్రమ వాసులంతా అందుకు కుతూహలంతో ఎదురు చూస్తున్నారు !

వాల్మీకి

ఓహో ! పురుషోత్తములు !

రామపాదం

వారు పురుషోత్తములు కాదట. పురుషోత్తమన ఏమిటో అది మీకే తెలుసున..

వాల్మీకి

(ఆలోచిస్తూ, తలపంకించి) సరే, సరే. ఆశ్రమ వాసులకు మొత్తం భాగవత జగత్తుకే నా గత చరిత్రను వారు ప్రదర్శించి చూపుతున్నారు! మరి నీవు? నీవు చూడవా?

రామపాదం

నేను మీ పాద రజోలేశాన్ని

వాల్మీకి

నీవు కూడ వెళ్ళి చూచిరా !

రామపాదం

సాక్షాత్తు మీ పాద సన్నిధిని ఉంటూ, మీ చరిత్రకోసం మరో చోటికి వెళ్ళనా? అది మీ గత చరిత్ర. గతంతో నాకేం పని? అయినా, అదంత తెలిసికోవలసినట్లైతే - ఇక్కడికే అది నాకు కనిపించాలి. ఏమైనా, నేను మాత్రం మిమ్మ విడిచి వెళ్ళను !

వాల్మీకి

ధన్యుడవు రామపాదం ! ధన్యుడవు ! అదేదో మనకు కూడ చెందినదైతే - అది మన దగ్గరకే వస్తుంది. మనల్ని వెతుక్కొంటూ వచ్చేదే మనది. రక్తి, భక్తి, ముక్తి - ఇవి మనం వెంటపడితే చిక్కేవికావు. అవి మనవెంట పడితేనే అది శక్తి ! శక్తే సమస్తమూ !

అదిగో, భరద్వాజుల వారి ప్రదర్శన ప్రారంభమైనట్టుంది ! చూడు !

రామపాదం

(ఆశ్చర్యంతో ముందుకు చూస్తూ) ఓహో, అద్భుతం ! అది స్వర్గంలో నందన వన ప్రాంత దృశ్యం ! బ్రహ్మదేవుడు ఒక్కడూ వన సౌందర్యాన్ని తిలకిస్తున్నాడు.

(ఇద్దరూ దూరంలోకి చూస్తూ ఉండగా - తెర.)

# ఆదికవి వాల్మీకి

## అంకం రెండు

(ఛాయా చిత్ర దృశ్యం. సాంబ్రాణి పొగ రంగంలో వ్యాపించి ఉంటే చాలు. లేక – ఒక పలచని కుంకుమ రంగు కాంతి రంగంలో స్థిరంగా ప్రసరించి ఉన్నా చాలు. అది అప్పుడు జరుగుతున్న దృశ్యం కాదు. గతంలో ఎప్పుడో జరిగిన విషయాన్ని యోగ దృష్టితో వెనక్కు చూచి, ముందుకు చూపించడం. భరద్వాజ మహర్షికి ఇటువంటి శక్తులు అపారంగా ఉన్నై. అప్పుడే వాల్మీకిగా వెలసిన ఒక నూత్న వ్యక్తిని గరువుగా స్వీకరించాడు. వాల్మీకి గురించి ఎవరికీ, ఏమీ తెలియదు. అందుకని, తాను చూస్తూ, తన శిష్యులకు చూపుతున్నా డాయన. వాల్మీకికూడ చూస్తున్నాడు దాన్ని ఎక్కడో దూరం నుంచి రంగంలో తానుగాని, వాల్మీకిగాని, శిష్యులు గాని ఉండరు. ఇదొక ప్రత్యేక రంగం.)

(రంగం అతి రమణీయంగా ఉంది. అది స్వర్గంలో నందన వన ప్రాంతం. అట్టి మనోహర వాతావరణంలోకి బ్రహ్మదేవుడు ప్రవేశించాడు. మంచి యౌవనంలో ఉన్నాడు. సాధారణంగా బ్రహ్మను, బృహస్పతిని లోకం వృద్ధులుగా భావించడం కలదు. అది తప్పు. ముసలితనమూ, చావూ లేని నిర్జరులు, అమరులు వారంతా. వారందరూ నిత్య యౌవనులే. స్వర్గ సౌందర్యాన్ని ఆనందంతో తిలకిస్తున్నాడు బ్రహ్మ.)

### నేపథ్యవాణి

స్వర్గంలోని నందన వన ప్రాంతంలోకి చతుర్ముఖ బ్రహ్మ – చతుర్వేద ప్రతీక – ప్రవేశించాడు. ఆయన సృష్టికి కర్త. వాక్కుకు భర్త. వాక్కును ఆరాధించే మానవుడంటే ఆయనకు పరమ ప్రీతి. ఆయన ఇష్టమే సుఖం. అనిష్టమే దుఃఖం. ఆయన సంకల్పమే

వీర్యం. దాని సాఫల్యమే శక్తీశ్వర సృష్టి! ఎప్పుడు ఆయన ఏమి చేస్తాడో, ఏమి సంకల్పిస్తాడో, ఏమి సృష్టి జరుగుతుందో - అంతా అనూహ్యం. అటువంటి బ్రహ్మ ఎవరికీ చెప్పకుండా - హఠాత్తుగా - స్వర్గంలోకి వచ్చాడు.

బ్రహ్మ

దివమృగనాభి కలితముల్ తెరువు లెల్ల !
తెరువులం దెల్ల ప్రణయసుందర సుఖేల !
ఖేల అమృత సౌరభ కిలికించితములు !
సరస శృంగార ధామ ఈ స్వర్గసీమ !

జీవ శృంగార సౌందర్య యౌవనములు
సృష్టి యొనరించి, విడిచితి స్వేచ్ఛకొలది !
మనుజు డిల దబ్బునే వరించిన కతాన
వచ్చి చేరిన వవ్వి ఈ స్వర్గసీమ !

రతిని, రసమును కల్పించి, క్షితికి పంపి,
నరుని అమరునిచేయు దం చాజ్ఞ యిడితి !
నరుడు అధికార మత్తు డైనందు వలన
శరణు జొచ్చిన నవ్వి ఈ స్వర్గసీమ !

నవ్యములు, భవ్యములు, మహా దివ్యములుగ
నే నొసంగిన ధనముల మానవుండు
రాజసమ్మున నిక్కి నిరాకరించి,
తామసమ్మున చిక్కి చిత్తయ్యె నకట !

చేసితి నేను మానవుని
సృష్టికి రత్న కిరీట మౌనటుల్ !
చూసితి నాత దన్నిటను
సుందరుడై వికసించు మార్గముల్ !

ఈ సున నే శనీశ్వరుడు
ఈ శుభ సృష్టిని వక్రదృష్టితో
ఏసెనొ ! దబ్బు తప్పు, మరి
యే నిజమున్ గయికోడు దుష్టుడై !

(ఒడలు జలదరించుకొని, ప్రస్తుతానికి వచ్చి, చుట్టూ పరికించి చూచి) ఓహో ! ఈ స్వర్గంలో, ఇంతటి మనోజ్ఞ వాతావరణంలో కూడ, నాకు నా మానవ సృష్టి మీదికే పోతున్నదే దృష్టి ! అవును ! తండ్రియైనవాడి మనస్తత్వమే ఇంత !

కొడుకొ – కూతురొ – ఎవరైన, కూర్మితోడ
తనను సేవించువారిని కనదు తండ్రి !
తనను కాదని పోయిన తనుజు లందె
ఆత్మ నిదుకొని ఏడ్చును ఆజ్ఞనట్లు !

మానవుడు నా సృష్టే అయినా – తండ్రిని ధిక్కరించిన కొడుకై అతడు దారి తప్పి నాశనమైనాడు ! నాకెందుకు ఈ విచారం ?

తనుజునిన్కోరి నే నెంతో తపముచేసి
మనుజువిన్ సృష్టిచేసితి మహితవృత్తి !
సుతుడు పాడౌట కనుచు ఓర్చుకొనుటెట్లు !
ఓర్చుకొనక చేసెడి దేమి టున్న దిపుడు ?

చరాచరాలలో, స్థావర జంగమాలలో, దేవ – దానవ – మానవ వర్గాలలో, సమస్త సృష్టిలోను – ఎందుకో నాకు మానవుడంటేనే ఎక్కువ ప్రీతి. నా సృష్టిపై నాకు

గల ప్రేమలోనే ఎంతటి పక్షపాతం (నవ్వుకొని) కావచ్చు ! ఏం చేస్తాం ! మానవుడు నన్ను ధిక్కరించేకొలదీ – ప్రీతి పాత్రుడవుతున్నాడు నా మనస్సుకు! నేను సృష్టించిన సమస్త సౌందర్యాలను కేవల భౌతికమైన ధనానికీ, అధికారానికీ బలిపెట్టేస్తున్నాడు ! మట్టిని బంగారమనీ, మృత్యువును భోగమనీ భావిస్తున్నాడు! నశించి పోతున్నాడు ! అతడి అజ్ఞాన తమో భీకర మనస్తత్వాన్ని రోసి, అమృత జీవన భోగ సౌభాగ్యం సమస్తం ఈ స్వర్గాన్ని ఆశ్రయించింది ! మానవుడి దృష్టిని తిరిగి పరమ మాధుర్యం కేసి మరల్చడం ఎలాగో ! తోచడంలేదు!

లోకము నిండ సుందరము
లున్ సుభగమ్ములు నైన భోగముల్
వాకలుగా సృజించి, జన
వాటికలందు స్రవింపజేసితిన్ !

రూకల కోస మేలనొన
రుం డిటు చావ దొడంగె ! జీవన
శ్రీ కలశిన్ పగుల్చుకొని,
చెత్త భుజించుట కేమి హేతువో !

మనిషి దేవత కాని కారణ మదేమొ !
మృత్యు వేలనొ నరునె ప్రేమించి వచ్చు?
అమృత సౌందర్యముల విడనాడి నరుడు
భ్రాంతి నర్చించినందుకు ఫల మదేమొ ?

అమృత మననేమి? సౌందర్య మనగ నేమి?
యౌవన మ్మన నేమి? దివ్య మననేమి?

అన్నియును నొక్కటే - అది అమలగుణము ?
అమల గుణమున వారలే అమరగణము !

ఈ అమరగణం అంతా అమరగుణ సంపన్ను లేనా? కేవలం ఇంద్రాది ప్రాభవ పదవులలో ఉన్నవారు తప్ప - అమరనజనం అంతా - అమలగుణ సంపన్నులే ! అందుకే ఇంద్రాదులకు పతనోత్తనాలున్నై ! తక్కిన అమరులంతా అప్సరసలతో సహా శాశ్వతానంద సుందరమూర్తులు! అర్థం, అధికారం అక్కరలేదు వారికి ! అవి రెండూ అక్కర లేని వారే నిజమైన అమరులు, అమృతమూర్తులు !

పదవియును, ప్రాభవమ్మును, వరుని కంటె
తానె ధనవంతుడను పేరు ఏ నరుండు
కొరడో - అతడే నాడు కూర్మిసుతుడు !
ప్రియసుతుడె నాకు లేడయ్యె పృథ్వి నరుల !

నరులలో నేను ఆశించిన ఆదర్శ పురుషు డెవ్వరూ లేనందు వల్లనే కాబోలు - నరులకోసం నేను సృష్టించిన అమృత సౌందర్యమంతా ఈ అమరలోకాన్ని ఆశ్రయించింది ! ఇప్పుడు నాకు స్వాగతం పలుకుతున్నది !

నాకు ప్రియమైన అమృత సౌందర్యమెల్ల
పారిజాతములై ఇందు పరిమళించు !
కల్పకమ్ములు నాకు స్వాగతము నిడుచు
తోరణమ్ములుగా పూచి త్రోవచూపు !

నా రాకను గురించి ఇక్కడ ఎవరికీ తెలియదే ! కాని - ఈ సమస్త దేవతా ప్రకృతీ తెలుసు నన్నట్టే నాకు స్వాగతం పలుకుతూ ఉంది ! ఇందులో చిత్ర మేముంది?

మనసుగల దేవదానవ మానవులకు
తను మనసె కాని - కాన్పించ దన్య మనసు !

**మనసు పరమ మనస్సుతో మసలు నట్టి**

**ప్రకృతి యౌను త్రికాలజ్ఞ ! ప్రాజ్ఞ ! తత్‌జ్ఞ !**

ఈ ప్రకృతే - నా రాకను గురించి దేవేంద్రుడికి సూచించిందేమో కూడ! (ఎదరకు చూచి) అదిగో ! దేవేంద్రుని పేరోలగమే కదలివస్తోంది ! నందనోద్యానమే నడిచి వస్తోంది ! ఈ వైభవంతో భూలోక సమ్రాట్టుల అహంకారాన్ని పోల్చి చూస్తే - నాకు అవాచ్యమైన దోమ సామెత జ్ఞప్తికి వస్తోంది. అదిగో ఇంద్రుడు ! (తల పంకించి) భోగపురుషుడు ! అదృష్ట వంతుడు ! శృంగార మంతా నాశులుగా పోసిన బంగారు బొమ్మలు - అరుగో, అప్సరసలు! మల్లెదండలో మందారంలా అదెవరు? ఊర్వశి !

మునుల తపోభంగం కోసం ఇంద్రుడు పంపినప్పుడు, విడి విడిగా చూడడమేతప్ప అప్సరసలందర్నీ ఒక్కసారి చూడలేదు. ఓహో, ఊర్వశి !

(అప్పుడు నృత్యం చేసుకొంటూ ఊర్వశి రంగంలో ప్రవేశిస్తుంది. బ్రహ్మ చాటుకు పోతాడు. ఆమె అందంగా కాసేపు ఆడి నిష్క్రమిస్తుంది. బ్రహ్మ తిరిగి రంగంలో ప్రవేశిస్తాడు. రాగోన్మత్తుడుగా కనిపిస్తాడు.)

బ్రహ్మ

ఓహో, ఊర్వశి !

ఆ ముఖం! ఆ పెదవులు ! ఆ బుగ్గలు ! ఆ కళ్ళు ! ఆ చూపులు ! ఆ వక్షస్సీమా శిఖరాయమాన సౌందర్యవ్యోమరవధునీ మనోమాధుర్యం ! ఆ నడుము! ఆ చలా చలన్న వోరు విలాస హేల !, ఓహో, మన్మధ బాణ పరంపర !

ముట్టడిం చేసినై ! వాటేసినై గుండెల్లో ! ఏమైపోతున్నా నేను?

ఓహో ! ఓహో ! ఊర్వశి (ఉన్మత్తుడై, రాగవరసలో) ఊర్వశీ ! ప్రేయసీ! (తన్మయుడై, ఉద్రిక్తుడవుతాడు. అతడి మనోవైకల్య మకుట కమలం నుంచి ఒక కాంతికణం జిగేలుమని జారి క్రింద పడుతుంది. క్షణం సేపు ఆనంద పారవశ్యంలో మునిగి ఉంటాడు. హఠాత్తుగా

తేరుకొని, కంగారుపడుతూ రసాభావ ! పరమ రసా భాస! ఛీ ఛీ ! ఎంత అసహ్యకరం ! జగన్నిగ్రహుడనైన నాకు ఈ నిగ్రహస్థలన మేమిటి? ఇప్పుడెలా? వాళ్ళంతా వచ్చేస్తున్నారే ! ఇపుడు దీని నుంచి ఎవరో ఒకరు పుట్టుకు వచ్చేస్తారే ! ఏం గతి ? (భూమిపై పడిన తేజంపై ఇంత మన్నుతోసి, కాలితో అదిమిపట్టి) ఇలాంటి లజ్జాకరమైన పని ఎప్పుడూ ఏదో ఒక అసమయంలోనే జరుగుతుంది! ఆనాడు శివపార్వతుల పెళ్ళి సమయంలో కూడ పౌరోహిత్యం వహించిన నాకు ఇలానే జరిగింది. అప్పుడు వాల్య మహామునులు పుట్టారు ! బ్రహ్మతేజం వృధా ఎలా పోతుంది? ఇప్పుడెవరు పుట్టుకు వస్తారో ! ఈ దేవ సన్మానంలో ఎంత అవమానం వ్రాసి పెట్టి ఉన్నదో కదా ! ఇంతకూ బ్రహ్మవ్రాతను బ్రహ్మకూడ తప్పించుకోలేడు!

(ఈ రకమైన వెలుగునీడల తరుణంలో – బ్రహ్మ కాలి అడుగునుంచి ఒక కుర్రవాడు పుట్టి, లేచి నిలబడ్డాడు – నాన్నా అంటూ ! ఈ కుర్రవాడే తర్వాత ఎప్పుడో వాల్మీకి అయినవాడు. అతణ్ణి బ్రహ్మ ఒడిలోకి తీసుకున్నాడు)

బ్రహ్మ

(తనలో) బ్రతికాను. ఒక్కడే పుట్టాడు. వాలఖిల్యుల వలె వందలు, వేలు పుట్టలేదు. గుడ్డిలో మెల్ల. ఇప్పుడు వాళ్లు వచ్చేలోగా వీణ్ణి ఎక్కడైనా దాచివేసి–

బాల వాల్మీకి

నాన్నా ! ఆకలి !

బ్రహ్మ

(కంగారుగా) ఆకలి! ఈ అమర భూమిలో ఆకలా? అయ్యో. ఇదెక్కడి పులిమీద పుట్ర? (కుర్రవాడితో) ఆకలేమిట్రా, వెధవా? ఇప్పుడు నీవు –

(అంతలోనే రంగంలోకి వచ్చేశారు – ఇంద్రుడు, ఊర్వశి, అప్సరసలు వగైరా – బిలబిలమంటూ! బ్రహ్మ కుర్రవాణ్ణి తన వెనుక దాచుకోడానికి తంటాలు పడతాడు.)

ఇంద్రుడు

(భక్తితో పాదాభివందనం చేసి) వాగీశ్వరీ హృదయేశ్వరా! సకల కల్యాణ కాలాస్రష్టా! సర్వ జగజ్జనకా! ఈ మా స్వర్గలోకానికి ఇదే నీకు మా స్వాగతం!

(ఇంద్రుడితో పాటు అతడి పరివారం అంతా శిరస్సులు వంచి అభివందనం చేస్తారు.)

బ్రహ్మ

(చిరునవ్వుతో, హుందాగా) మహేంద్రా! శచీవల్లభా! సహస్రాక్షా! నీ స్వాగత సత్కార్యాలకు నేను అమందానంద కందళిత హృదయార విందుడనై–

బాల వాల్మీకి

(బ్రహ్మ వెనుకనుంచి మెల్లగా) నాన్నా ! ఆకలి !

బ్రహ్మ

(కుర్రవాడి నోటిని మూసి, వాడి ముఖాన్ని తన షష్ఠానికి గట్టిగా అదుముకొంటూ, పైకి ఇంద్రుడితో) సహస్రాక్షా ! నీ స్వాగత సత్కారాలకు నేను అమందానంద కందళిత హృదయా !

బాల వాల్మీకి

(కొంచెం గట్టిగా) నాన్నా ! ఆకలి ! ఆకలి !

(బ్రహ్మ వెనుకనుంచి వస్తున్న శబ్దాన్ని, బ్రహ్మ తికమకను గుర్తించిన దేవేంద్రాదులు విస్తుపోతారు. కొంచెం వెనక్కి తగ్గుతారు. అప్సరసలు గుస గుస లాడతారు. ఊర్వశి ముందుకు వస్తుంది. ఆమెను చూచి బ్రహ్మ మరీ సంకుచితు డవుతాడు. అతడి అవస్థ వర్ణనాతీతంగా ఉంది. అతడి మనస్సు మనస్సులోనే లేదు. అయినా, మెహర్బానీగా కనిపిస్తాడు పైకి. ఇంద్రుడు ఊర్వశికేసి కొంటెగా చూస్తాడు. ఆమె పరితప్త అవుతుంది.)

బ్రహ్మ

అమరనాథా ! మేషాండా! నీ స్వాగత సత్కారాలకు నేను - నేను - అమందానంద - ఆనంద - కందళిత - కందళిత -

బాల వాల్మీకి

(ఎదరకు వచ్చేస్తూ) నాన్నా ! ఆకలి. ఆకలి! ఆకలి నాన్నా!

(దేవేంద్రాదులు ఆ బాలుణ్ని ప్రేమగా చూస్తారు. అయినా దూరంగానే ఉంటారు. బ్రహ్మకు సిగ్గూ, తాపమూ, కోపమూ ఒక్కసారిగా ముప్పిరిగొన్నై. ఊర్వశి బాలుణ్ణి ఒడిలోకి తీసుకొంటుంది.)

ఊర్వశి

ఏం, బాబూ ! ఏం కావాలి, బాబూ !

బాల వాల్మీకి

(అక్కడి అందర్నీ ఒక్కసారి చూచి, ఊర్వశికేసి పళ్ళికిలించి) అమ్మా! ఆకలి ! ఆకలి ! ఆకలి ! ఆకలి !

ఊర్వశి

అయ్యో, తండ్రి !

బ్రహ్మ

(కోపంతో వాణ్ని గింజుకొంటూ) ఎవడ్రా నీవు? ఏమిటి నీ ఆగడం?

బాల వాల్మీకి

ఎవణ్నా ? ఏమో ? నాకేం తెలుసు? ఓ తెలుసు! తెలుసు! నేను నీలో వాణ్నే ! నీలోనుంచి వచ్చిన వాణ్నే, నీవే నా నాన్నవు ఆకలేస్తోంది, నాన్నా ! అబ్బా ఆకలి ! (కన్నీరు తుడుచుకుంటాడు)

ఇంద్రుడు

(ఆశ్చర్యంగా) ఆకలి ! ఆకలి అంటే? అదేమిటి?

ఊర్వశి

(జాలిగా) అదేమిటో తెలిస్తే, నేనైనా తెచ్చిపెడతా (బాలుడితో) [illegible]బూ! అదేమిటి?

ఇంద్రుడు

(బ్రహ్మతో) పరమేష్ఠీ! ఈ బాలుడు కోరుతున్న ఆకలి అనేది ఏ పదార్థమో చెపితే, మేము ఇవ్వగల మేమో!

బ్రహ్మ

(విసుగ్గా) అది మీ కెవరికీ తెలిసేది కాదు లేవయ్యా ! (బాలుడితో, కోపంగా) వ్రేలెడంత లేవు. వెధవా! ఏమిటిరా నీ వంటున్నది? పెద్దా చిన్నా లేకుండా, వేళాపాళా లేకుండా, నీవెక్కడ ఉన్నావో గుర్తించుకోకుండా – నోటికెంత వస్తే అంతా అనేస్తావ్? పైగా, నా కొడుకు నంటావ్? నా కొడుకువైతే – నీకు ఆక లేమిట్రా, చండాలుడా?

బాల వాల్మీకి

(ఏడుస్తూ) మరి – మరి – నీ తేజాన్ని మట్టితో చేర్చావుగా? మానవుణ్ని ధ్యానించావుగా? నా తప్పేముంది? నరునిపట్ల నీ ఆత్మీయతే నా ఆకలి. నీ అసమప్రీతి అన్నం కోరుతోంది. అయ్యో, ఆకలి ! అమ్మో, ఆకలి!

బ్రహ్మ

(కోపోద్రేకంతో) ఓరి, చండాలుడా! (ఒక్క చెంపకాయ కొట్టి) నీవు చండాలుడవై పో! పో ! (నెట్టి పారవేస్తాడు. వాల్మీకి అలానే నిష్క్రమిస్తాడు.)

ఊర్వశి

(ఆత్రంగా) అమ్మో ! బిడ్డడు ! (భయంతో కళ్ళు మూసుకొంటుంది)

బ్రహ్మ

(ఉన్మత్తుడివలె) బిడ్డడు ! అయితే మాత్రం ! ఇంతమందిలోనూ నా రహస్యం బట్టబైలు చేస్తాడా? నా పరువుకాస్తా తీసి పారేస్తాడా? వెధవ ! చండాలుడు ! పరమ చండాలుడై పడిఏడవనీ? అదే వాడి అహంకారానికి శాస్తి ! (దురుసుగా నిష్క్రమిస్తాడు)

ఊర్వశి

(కసిగా) అహంకారానికి శాస్తికాదు; సత్యం చెప్పినందుకు శాస్తి ! ఆహా! మగవాడు ! మగవాడు ఎంత దుర్మార్గుడు.

ఇంద్రుడు

(ఆశ్చర్యం నుంచి తేరుకొని) పరమేష్ఠి ప్రవర్తన బహు చిత్రంగా ఉంది! చెప్పకుండా స్వర్గానికి వచ్చాడు ! అయినా, సమస్త భోగాలనూ ఆయనకు చవిచూపాలనుకొన్నాం. మధ్యలో ఈ రసాభాస ! ఎంత ఆశాభంగం !

ఊర్వశి

రహస్యం దాచలేని వాళ్ళు, అబద్ధం ఆడలేని వాళ్ళు, మోసం చెయ్యలేని వాళ్ళు అంతా ఇలా చండాలురైపోతూ ఉండడం విచిత్రం !

ఇంద్రుడు

బ్రహ్మ ఇలా ఎందుకు చేశాడో, ఇందులో ఏ రహస్యం ఇమిడి ఉన్నదో - మనకు తెలీదు !

ఊర్వశి

(కళ్ళు తుడుచుకొంటూ) పాపం - ఆ పసిబిడ్డ చండాలుడై, ఎన్ని అవస్థలు పడుతున్నాడో !

ఇంద్రుడు

(నవ్వి) ఎట్టి సంబంధమూ లేకుండా కేవల నిమిత్త మాత్రంగా మాతృమూర్తివైన నీ హృదయమే ఇంత సుందరంగా ఉంటే - స్వయంగా కనిపించే మానవ మాతృ దేవతల హృదయం ఎంతటి అమృత భాండమో కదా !

(ఆమెను తీసుకొని నిష్క్రమిస్తాడు. పరివారం అనుసరిస్తారు. తెర)

# ఆదికవి వాల్మీకి

## అంకం మూడు

(మరొక ఛాయా చిత్ర దృశ్యం. బృహ దరణ్యంలో ఒక కొండ. ఆ కొండమీద ఇటూ, అటూ పచార్లు చేస్తున్నాడొక చండాల యువకుడు. ఎవరికోసమో ఎదురు చూస్తున్నాడు. ఒక అంగవస్త్రం గోచీపెట్టి, మొలకు చుట్టుకున్నాడు. తక్కిన శరీరంపై ఏ దుస్తులూ లేవు. ఏదో ఒక మూలిక మాత్రం మెడలో కట్టుకున్నాడు. శిరోజాలు బాగా పెరిగి, ఉంగరాలు తిరిగి ఉన్నై. గడ్డం నున్నగా ఉంది. కాటుకకళ్ళు. బండ ముక్కు. వెదురుబద్దలాంటి శరీరం. తీవ్ర ప్రకృతి. అతడే తరుణ వాల్మీకి. అతడు ఒక విల్లును తయారుచేసుకొంటూ, ఎవరికోసమో ఎదురు చూస్తూ, రంగంలో తిరుగుతున్నప్పుడు - లోపలినుంచి అతణ్ని గురించిన పరిచయం సామాజిక లోకానికి వినిపిస్తూ ఉంది.)

### నేపద్యవాణి

అతడే తరుణ వాల్మీకి. గతం జ్ఞాపకం లేదు. ఆ కొండ దిగువ మైదానంలోని ఒక మాలమాదిగ గూడెంలో ఒక కూలి జంటకు ఎన్నో వ్రతాల పుణ్య ఫలంగా పుట్టాడతడు. గారాబంగా పెరిగాడు. ఏ పనీ చేతకాదు ! ఒక వృత్తి అంటూ ఏదీ లేని కులంలో పుట్టాడు. హీనంగా, దీనంగా బ్రతకడం అతడి కిష్టంలేదు.

ఏ ఒక్క విషయం మీదా మనస్సు నిలవదు. ఉన్నచోట ఉండడు. అడవుల్లో, కొండల్లో ఇష్టం వచ్చినట్లు తిరుగుతాడు. వేళకు భోజనానికి కూడ రాడు. రోజుకో రకమైన వింత జంతువుల్ని, పక్షుల్ని, చేపల్నీ తెస్తూ ఉంటాడు. తల్లిదండ్రుల కతడొక ముద్దు. ఇరుగుపొరుగుల కొక మొద్దు. తల్లి దండ్రు లతడికి పెట్టిన పేరు వీరబాహు. హరిశ్చంద్రుడి వంటి చక్రవర్తుల్నే కొన గలిగినంత ధనశాలి కావాలని వారికోరిక

కావచ్చు. కాని, అతడిలో ఆ లక్షణాలేమీ లేవు. ప్రస్తుం ఒక బోయపిల్ల ప్రేమలో చిక్కుకున్నాడు. ఆమె పేరు మకరంద. ఆమె కోసమే ఎదురు చూస్తున్నాడు !

(రంగంలో తరుణ వాల్మీకి వెదురుబద్ద చెక్కుతూ, నోటికి వచ్చినట్టెల్లా పాడుతూ, కొండ ఎగువలో ఎక్కడో ఉన్న బోయగూడెం కేసి పారచూస్తూ, విసుగెత్తి పోతున్నాడు.)

**తరుణ వాల్మీకి**

**పెందల కడె వస్తానని**
**పెదివి కొరికి చెప్పిందీ !**
**ఎండ పోయిందంటే**
**ఎడా పెడా కొట్టమంది !**
**కొట్టించు కోవడమే**
**కోరిక బాగుంది !**
**తియ్యగా ఉంటాది !**
**తినెయ్యాలనుంటాది !**
**పెళ్ళాడ దామంటే**
**పళ్ళికి లిస్తాది !**
**తన్నులు తింటే గాని**
**దారికి రానట్టుంది !**

(ఎదరకు చూచి) అదిగో ! వచ్చేస్తోంది ! రానీ చెపుతా ! (ఆమెను చూడనట్టు, వెనక్కితిరిగి నిలబడతాడు. అప్పుడు వెనకనుంచి మకరంద ప్రవేశిస్తుంది. అందమైన ఆటవిక కన్య ఆమె. వెదురుకర్రకొక బుట్ట తగిలించి భూజాన్ని వేసుకొని, నవ్వుతూ మెల్లగావచ్చి, అతడి వెనుక నిలబడి, ఏదో పిట్టలా కూస్తుంది. అతడు నిదాలున వెనక్కి తిరిగి, ఒక్క చెంపకాయ కొడతాడు. ఆమె కెవ్వు మంటుంది. కర్ర, బుట్ట పడిపోతాయి. బుట్టలోని పళ్ళు, తేనేతెట్టె అన్నీ చెల్లాచెదరవుతాయి. అతడు ఒక పండుతీసుకుని కొరుకుతూ ఉంటాడు.)

మకరంద

(బుగ్గ తడుముకొంటూ, కోపంతో) పొగరు !

తరుణ వాల్మీకి

(ఆమె వంక చూడకుండానే) పొగరే. రెండో చెంప కూడా ఉంది !

మకరంద

(అతడి మీదికి వెళుతూ) ఉండకేమవుతుంది ? ఇదిగో ! (రెండో చెంప కూడా ఇస్తుంది. తరుణవాల్మీకి ఆ చెంపను కూడ ఛెడేలు మనిపిస్తాడు. ఆమె కెవ్వున పడిపోతుంది.)

తరుణ వాల్మీకి

(ఆమెకేసి చూడకుండానే, పండు తింటూనే) కొందరికి మాటలు చాలు. కొందరికి ముద్దు చాలు. కొందరికి ఒక్క చెంపకాయ చాలు. కొందరికి ఏదీ చాలదు. చితగ్గొడిగే తప్ప కొందరికి తృప్తి కలగదు.

మకరంద

(లేచి, కళ్ళు తుడుచుకొని, తీవ్రంగా అతడి ఎదరకు వచ్చి) అంటే ?

తరుణ వాల్మీకి

(నిర్లక్ష్యంగా) అదే !

మకరంద

నేను ఆలస్యం చేశాననేగా ఈ కోపం ?

తరుణ వాల్మీకి

ఈ కోపం కోసమేగా నీవు ఆలస్యం చెయ్యడం ?

మకరంద

తండ్రిచాటు బిడ్డను. అనుకొన్న వేళకు ఎలా రాగలను?

తరుణ వాల్మీకి

(కసిగా) నీవు నాతో ఎందుకు వచ్చెయ్యవు ?

మకరంద

నీ మాల మాదిగ చండాల గూడెంలోకా? ఆ మురికిలోకా? మనిషిగా బ్రతుకుతున్న నేను నీతో వచ్చి ఒక పురుగులా చావనా?

తరుణ వాల్మీకి

(పండు శేషాన్ని అవతలికి విసిరికొట్టి) ఏమిటి నీ ఉద్దేశం ?

మకరంద

(నిర్లక్ష్యంగా) లోగడ లక్షసార్లు చెప్పిందే.

తరుణ వాల్మీకి

అంతేనా?

మకరంద

(లాలనగా) మగడా! నీకు నోరు, చేయి తప్ప - మెదడున్నట్లు లేదు. నోటికి వచ్చినట్టెల్లా తిట్టడం, వట్టి పుణ్యానికి మీదపడి కొట్టడం. నీకు తెలిసిందెల్లా ఇంతే ! ఇటో, అటో తేల్చుకుపోదామనే వచ్చానిప్పుడు. నేను చెప్పేమాట కాస్తవిను. మానవుడికి మెదడు ఉండాలి. ఉన్న మెదడుని ఉపయోగించుకోవాలి. లేకపోతే, అట్టివాడు జంతువే ! మనం చచ్చినా జంతువులం కాగూడదు.

తరుణ వాల్మీకి

సరేలే. చెప్పేదేదో చెప్పు !

మకరంద

నేను నిజంగా నీకు కావాలా?

తరుణ వాల్మీకి

(కొట్టేటంత తీవ్రంగా చూచి, తమాయించుకొని, ఏడుపు ముఖం పెట్టి) ఎందుకు నన్ను ఇలా రెచ్చగొట్టి ఏడ్పిస్తావ్ ?

మకరంద

(చిరునవ్వుతో) అందుకే నీవంటే నా కిష్టం. రెచ్చగొడితే రెచ్చిపోయేదీ, ఏడ్పిస్తే ఏడ్చుకొనేది మెదడులేని మృగమే. నీ వొక మృగానివి. మృగం అంటే నా కిష్టం. మృగం అంటే వెధవ లేడి కాదు. సింహం. నేను సింహాన్నెక్కి స్వారీ చెయ్యాలి. సింహ వాహనను కావాలి. తెలిసిందా?

తరుణ వాల్మీకి

(పళ్లు బిగించి) ఓ, తెలియకేం? నా మీదెక్కి స్వారీ చేస్తానంటావ్ ? అంతేనా ?

మకరంద

అంతే, అది నీ కిష్టమైతే, పెళ్ళి. లేకపోతే -

తరుణ వాల్మీకి

లేకపోతే ?

మకరంద

లేకపోతే - చస్తాను. చచ్చేది నేనే. ఆడదాన్నిగా? నీకేం నీవు మగరాజువి!

తరుణ వాల్మీకి

(దీనంగా) అంతేనా ? నన్ను కనిపెంచిన తల్లిదండ్రుల ఆశలో ?

మకరంద

ఏ తల్లిదండ్రుల ఆశలైనా, కని పెంచడం వరకే. రెక్కలు వచ్చిన పిట్టలు ఎగిరిపోక తప్పదు.

తరుణ వాల్మీకి

మరి – మనం మానవులం కదా ?

మకరంద

అందుకే, మానవజాతి ప్రకృతి ధర్మాన్ని విడిచి, ఇలా పతనమై పోయింది!

తరుణ వాల్మీకి

ఏమో – నీ వాదన నాకు బలంగా కనపడడం లేదు.

మకరంద

పోనీ – మగవాడి తల్లిదండ్రులకూ, ఆడదాని తలిదండ్రులకూ బాధ్యతలో భేదం ఉన్నదని అంగీకరిస్తావా ?

తరుణ వాల్మీకి

ఓ అంగీకరిస్తాను.

మకరంద

ఇప్పుడు నీవు మెదడు ఉపయోగించావు. అయితే – మరి – నీ తల్లిదండ్రుల బాధ్యతకంటె, నా తలిదండ్రుల బాధ్యత గొప్పది కాదా?

తరుణ వాల్మీకి

గొప్పదే.

మకరంద

మనం ఒక ఇంటి వాళ్ళ మైనప్పుడు – గొప్పగా బ్రతకాలా ? తక్కువగా బ్రతకాలా?

తరుణ వాల్మీకి

గొప్పగానే బ్రతకాలి.

మకరంద

ఇప్పుడాలోచించు ! నీ సమాజం ఎలాంటిది? నా సమాజం ఎలాంటిది? నీ సమాజం చండాల దుష్టం. నా సమాజం స్వేచ్ఛా మధురం. కాదా ?

తరుణ వాల్మీకి

అవును !

మకరంద

నేను నీతో వస్తే - నీతో పాటు నేను కూడ చండాలిని అవుతాను. కృతకమైన వర్గీకరణకు బానిస అవుతాను. దానితో - దరిద్రం, మురికి, దీనత్వం, పిరికితనం, దాస్యం, నీచత్వం - అన్నీ సంక్రమిస్తాయి ! అది కూడ ఒక బ్రతుకే అంటావా ?

తరుణ వాల్మీకి

(సాలోచనగా) మరి, మా వాళ్ళంతా బ్రతకడం లేదా ?

మకరంద

నీవు నాతోవస్తే - నాతోపాటు నీ వొక దొరవు ! ఈ పర్వతారణ్యా లన్నీటికీ, ఈ పర్వతేయులందరికి ప్రభువువు ! నీ నాగరిక చండాల సమాజంలో ఉన్న ఏ కుళ్ళూ లే దిక్కడ ! స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ఆటుపట్లు మా భూములు! ఇప్పుడు నీవు నా హృదయానికి మాత్రమే దొరవు. అప్పుడు ఈ సమస్త ఆటవిక ప్రపంచానికి దొరవు ! అదీగాక - ఈ ఆటవిక ప్రపంచ మంతా ఎక్కడిది? నాగరిక ప్రపంచపు దాస్యనరకం నుంచి తప్పించుకొని పారిపోయి వచ్చిన స్వేచ్ఛా ప్రపంచమే ! మా తాతలు చెప్పుకొంటూ ఉంటే విన్నాను;

తరుణ వాల్మీకి

(నిశ్చింతగా) అయితే, పద ! నీతో వచ్చేస్తున్నాను !

మకరంద

(అతణ్ని ఆనందాతిశయంతో కౌగలించుకొని) ఓహో ! ఇక మనకు ఎడబాటు లేదు ! (అతడిచుట్టూ తిరుగుతూ, ఆటవికులకు ప్రియమైన గిరి పుష్ప నృత్యం చేస్తుంది - గిరి గీతం పాడుతూ.)

గిరిగీత

ఓ - గిరి పుష్ప !
పంపవే పరిమళం !
ఓ - గిరి పుష్ప !
నింపవే మధురసం !
ఓ - గిరి పుష్ప !
పంచవే అమృతం
ఓ - గిరి పుష్ప !
పంచవే జీవనం !

(మకరంద నృత్యంతో తరుణ వాల్మీకి కూడ కలుస్తాడు. మెల్లగా తెర.)

# ఆదికవి వాల్మీకి

## అంకం నాలుగు

(రెండు మూడు అంకాలలోని దృశ్యాలవలెనే ఛాయా చిత్ర దృశ్యం. అరణ్య మధ్యంలో ఒక కాలిబాట. అటూ, ఇటూ దొంగచూపులు చూచుకొంటూ ప్రౌఢ వాల్మీకి ప్రవేశిస్తాడు. ఆరితేరిన దారిదోపిడీగా డిప్పుడితడు. చేతిలో ఒక బలమైన వెదురుబద్ద. అది అవసరాన్ని బట్టి విల్లుగాను, దండం గాను కూడ ఉపయోగపడుతుంది. వీపున అమ్ములపొది. అతడు మార్గస్థుల రాకపోకలను గమనిస్తూ, పొదలమాటున ఒక శిలపై కూర్చుని ఉన్నాడు - బాణాలకు పదును పెట్టుకుంటూ. ఈ లోపల సామాజిక లోకానికి లోపలినుంచి అతని వివరాలు తెలుపబడుతూ ఉంటై.)

### నేపథ్యవాణి

చండాలుడైన వాల్మీకి, తలిదండ్రులకు చెప్పకుండా బోయ కన్య అయిన మకరందను పెండ్లాడి, ఆమెతో లేచిపోయి కొండజాతులలో కలిసిపోయాడు. కిరాత వృత్తిని అవలంబించాడు. వేటలో మొనగాడు. వాయుచర, భూచర, జలచర జంతు వేదైనా సరే - అతడు బాణం వేస్తే - అతడి వంటింట ఉండవలసిందే ! పెళ్ళి వెంటనే సొంత కాపురం పెట్టాడు. గంపెడు పిల్లలు పుట్టారు. మకరంద ఆనాడు వట్టి ప్రియురాలు. ఇప్పుడు బాధ్యతగల తల్లి. పిల్లలు అందివచ్చారు. వేటలో ఆరితేరారు. అందువల్ల ఆహార సంపాదన బాధ్యత కొంత తగ్గింది వాల్మీకికి. భోగాల మీదికి మళ్ళిందతడి దృష్టి. తాను పుట్టిన చండాల కులమూ, మెట్టిన శైలజ కులమూ కూడ నాగరిక భోగాలకు దూర మైనట్టివే. ఆ భోగాలు ఎలాంటివో చూడాలను కున్నాడు.

తాము చేసే హింస ఆహారం కోసం మాత్రం. నాగరికులు భోగభాగ్యాలకోసం, అధికారాల కోసం అనేకమైన చిత్రహింసలు చేస్తారు. అవేమిటో చూడకపోతే,

జీవితానుభూతి సమగ్రం కాదు. తాను రమారమి ముసలివాడు. కుటుంబ పోషణకు తానిక ప్రధానం కాదు. లోక ప్రవృత్తిని పరిశీలించేందుకు ఇదే సమయం. అందుకు ఏం చెయ్యాలి? తనకు చేతనయిం దొక్కటే. ముందుగా నాగరకులను దోచు కోవడం !

అతడు దోచేది పనికి మాలిన దనాన్ని కాదు. వినోదకరమైన రత్నాలను మాత్రమే కాదు. వారి నాగరికతా గర్వానికి హేతువలైన సాధనాలను కూడ ! అందుకే అతడు వట్టి దోపిడీ కాదు కాదు. శ్రీకృష్ణుడు ఎంతదొంగో, వాల్మీకి కూడ అంతే దొంగ అనవచ్చు.

(లోపల ఏదో అలికిడి అయింది. ప్రౌఢ వాల్మీకి లేచి, అటుకేసి చూశాడు. ఒక యువతీ యువకుల జంట రంగంలో ప్రవేశించారు. సరదాగా పోతున్నారు. ప్రౌఢ వాల్మీకి హఠాత్తుగా వారి ముందుకు దూకాడు.)

ప్రౌఢ వాల్మీకి

(కఠినంగా) ఆగండి !

(జంట భీతితో కెవ్వుమంటూ ఒకర్నొకరు కౌగలించుకుంటారు.)

యువకుడు

(అంజలి ఘటించి) దొరా ! పేదవాళ్ళం !

ప్రౌఢ వాల్మీకి

మీ దగ్గర ఏముందో అంతా అక్కడ పెట్టండి !

యువతి

(వణుకుతూ) ఎ ఎ ఎ ఏం లేదండి, దొంగ గారూ !

ప్రౌఢ వాల్మీకి

(వాళ్ళను ఎగా దిగా చూచి, పెదవి విరిచి) వట్టి తరుణ ప్రణయం. కౌగలింతలు తప్ప – మీ దగ్గర ఏమీలేదు ! (యువతితో) ఆ కంకణాలు బంగారువేనా? అయినా – బంగారం నా కెందుకు? సరే ! పొండి !

(జంట నిష్క్రమిస్తారు. ప్రౌఢ వాల్మీకి యథాస్థానం గ్రహిస్తాడు. కొంతసేపటికి ఒక బ్రాహ్మణుడు భుజాన ఒక మూటతో ప్రవేశిస్తాడు. అలానే నిష్క్రమిస్తాడు. ప్రౌఢ వాల్మీకి అతణ్ని చూచి, పెదవి విరిచి, ఊరుకున్నాడు. అదేవిధంగా చాలామంది ఆ దారిని పోయారు. ప్రౌఢ వాల్మీకి కల్పించుకోలేదు. చివరకు అతడు విసుగెత్తిపోయాడు. ప్రొద్దు చూశాడు. పెదవి విరిచాడు.)

ప్రౌఢ వాల్మీకి

ఈ దినం చాల దుర్దినంగా ఉందే ! ఉదయం వచ్చి కూర్చుంటే – మధ్యాహ్నం అయినా ఒక్క గొప్ప వాడు కూడా ఈ దారిని పోలేదు ! ఒక్క అపూర్వ వస్తువు కూడ లభించలేదు ! వట్టి చేతులతో పోతే – మా మకరంద – కేవలం మకరం చంద మవుతుంది ! ఆమెకు ఇప్పుడు కావలసింది ప్రేమ కాదు – హృదయం కాదు – శరీరం కాదు – ఆహారం కాదు – ఆమె స్త్రీ ! స్త్రీ తల్లి అయిన తర్వాత – ఆమెకు కావలసింది భర్త కాదు – బిడ్డలు ! నానుంచి నేడు ఆమె ఆశించేది అపూర్వ రత్న సంపద ! అది ఏ దినం లభించక పోతే – ఆ దినం నేను ఆమెకు పరపురుషుణ్ని ! స్త్రీ ప్రియురాలు తరించినంత సులభంగా భార్యగా తరించలేదు ! అందుకు కారణం – ప్రియురాలు త్యాగమయి, భార్య స్వార్థమయి.

(అంతలో – తెరలో కలకలం ! ఏదో పాట ! పాడుకొంటూ నారదుని ప్రవేశం ! ప్రౌఢ వాల్మీకి ఉత్సుకత !)

నారదుడు

నారాయణా – నారాయణా !
నారాయణా – లక్ష్మీ నారాయణా !
వేదాల దొంగను వెదకి చంపిన మీన !
ఆదిత్యులకు అమృత మంద జేసిన జాణ !
కడలిలో మునిగేటి పుడమి నెత్తిన శౌరి !

దుష్ట రాజుల దునిమి దొరవైన మురవైరి !

నారాయణా - నారాయణా !

నారాయణా - లక్ష్మీనారాయణా !

(పాడుకొంటూ, నాట్యం చేసుకొంటూ వస్తున్న నారదుని పైకి దూకుతాడు ప్రౌఢ వాల్మీకి. ఇద్దరూ అలా నిలబడి పోతారు.)

ప్రౌఢ వాల్మీకి

(వెటకారంగా) ఏయ్ ! ఏమిటి - దొంగా, గింగా అంటూ గంతే లేస్తున్నావ్!

నారదుడు

నేనన్న దొంగ నీవు కాదు, నాయనా ! మీ దొంగ లందరికీ గురువైన వేదాల దొంగ !

ప్రౌఢ వాల్మీకి

వేదాలంటే ఏమిటి? ఆ గొప్ప దొంగ ఎవరు ?

నారదుడు

అదంతా ఒక పెద్ద కథలే. దొంగలు అనేక రకాలు. వస్తువులు, మణులు దొంగలించే వాళ్ళు మామూలు దొంగలు - గ్రంథాలను, భావాలను దొంగలించే వాళ్ళు పైశాచిక దొంగలు. మనస్సులను, హృదయాలను దొంగలించే వాళ్ళు-

ప్రౌఢ వాల్మీకి

నీ చేతిలో దేమిటి? అది మోగుతూనే ఉందే !

నారదుడు

ఇది వీణ. దీని పేరు మహతి. ఇది నిరంతరం నారాయణ నామగానం చేస్తూ -

ప్రౌఢ వాల్మీకి

సరే. అదక్కడ పెట్టిపో !

నారదుడు

(ఉలిక్కిపడి) ఆఁ ఇదే ? ఇది నీ కెందుకు ?

ప్రౌఢ వాల్మీకి

ఎందుకైతే నీ కెందుకులే ! పాటంటే నాకూ ఇష్టమే

నారదుడు

అది నీ చేతికి వస్తే పాడదు. కావలిస్తే చూడు ! (వీణను ఇస్తాడు)

ప్రౌఢ వాల్మీకి

(పుచ్చుకొని, పరిశీలించి) పాడకపోతే పోయిందిలే. ఇలాంటి దివ్య వస్తువు నేనింతవరకు చూడలేదు. సరే. ఇక నీవు పో ! (వెనుదిరుగుతాడు.)

నారదుడు

(కంగారుగా) అయ్యో, నా వీణ ! (నిభాయించుకొని) ఇదిగో, నాయనా! నీవు దొంగవైనా, తెలివైన వాడిలాగే ఉన్నావు ! ఇలాంటి తెలివైనవాడు దొంగతనం చెయ్యకూడదు. దొంతనం పాపం కదా ? నీ వెవరికోసం ఈ పాపం చేస్తున్నావో, ఆ నీ భార్య బిడ్డలు ఈ పాపంలో పాలుపంచుకుంటారా?

ప్రౌఢ వాల్మీకి

ఓ, ఎందుకు పంచుకోరు? బిడ్డల మాటకేం కాని – నా భార్య తప్పకుండా పంచుకొంటుంది. ఆమె చాలా పతివ్రత. అసలు మొత్తం ఆమె తీసుకొంటుంది కూడ. ఇదంతా ఆమో కోసమే కదా?

నారదుడు

ఆ సంగతి ఎప్పుడైనా ఆమెను కనుక్కున్నావా ?

ప్రౌఢ వాల్మీకి

కనుక్కో అక్కరలేదు. నాకు తెలుసు.

నారదుడు

(నవ్వుతూ) నీకు తెలుసు. నిజమే ! కాని – పోనీ, కనుక్కుంటే ఏం పోయిందీ? కొన్ని విషయాలు మనకు తెలిసినట్టే ఉంటై. కాని, తెలియవు. స్త్రీల విషయంలో మరీ నిక్కచ్చిగా ఉండడం అనవసరం. ఒక్కసారి పోయి, నీ భార్యను కనుక్కురా !

ప్రౌఢ వాల్మీకి

నీ యెత్తు నాకు తెలుసు. చచ్చినా, ఇక ఈ వీణ నీకు దక్కదు.

నారదుడు

పోనీలే, నేను మరొకటి సంపాదించుకుంటాను. అది నీ కూడానే ఉంటుందిగా? వెళ్ళి, ఆమె నడుగు ! నీ పాపంలో సగమైనా ఆమె పంచుకుంటా నంటే – నీవు తిరిగి రానక్కరలేదు. పంచుకోనంటే మాత్రం ఒక్కసారి వచ్చి వెళ్ళు !

ప్రౌఢ వాల్మీకి

పోవయ్యా, పో ! నా భార్యసంగతే నాకు తెలీదంటావ్ ?

(ప్రౌఢ వాల్మీకి వీణతో నిష్క్రమిస్తాడు. నారదుడు అడుకేసి కాసేపు అలానే నిలబడి చూచి, ఒక వెదురు ముక్కను అందుకుంటాడు. అది మహతివలె మ్రోగుతుంది. పాడుకొంటూ పచార్లు చేస్తాడు.)

నారదుడు

నారాయణ ! దాసోహ !
ఘోరమయా ఈ నరుని అహం !
నరనారాయణు లొకటే అయితే,
నరుని కింత దుర్మతి ఎందుకయా ?
ఒక్కసారి నరుడవు కావయ్యా !
ఉర్వి నరుల దౌష్ట్యము కనవయ్యా !
నారాయణ ! దాసోహం !
ఘోరమయా ఈ నరుని అహం !

(నారదుడు మహతీ గానంతో ఆడుతూ, పాడుతూ ఉండగా – ప్రౌఢ వాల్మీకి దీనంగా ప్రవేశించి, ఆశ్చర్య చకితుడవుతాడు. తన చేతిలోని మహతి వెదురు ముక్కగాను, నారదుని చేతిలోని వెదురు ముక్క మహతిగాను కనిపిస్తుంది. అతడు దానిని పారవేసి, నారదుని ముందు సాష్టాంగపడతాడు. నారదుడు నాట్యం ఆపి, అతణ్ని లేవనెత్తుతాడు.)

నారదుడు

ఏం జరిగింది, నాయనా ? ఎందుకంత దీనుడి వైనావ్ ?

నీ వెవరో మహాను భావుడవయ్యా ! నా భార్య పంచుకోను పొమ్మంది! ఇక నేనెక్కడికి పోను ? ఎలా బ్రతకను ? నా బ్రతుకంతా భార్యే అనుకున్నాను. ఆమె కోసం నా తల్లి దండ్రుల్ని, స్నేహితుల్నీ కూడ విడిచి పెట్టేశాను. ఆమె సుఖానికి నా సర్వస్వం ధారపోశాను. ఇప్పుడు ఈ వృద్ధాప్యంలో పొమ్మంటే, ఎక్కడికి పోను ? ఎలా బ్రతకను ? ఇక నాకు – (దుఃఖం ఆగక ఏడుస్తాడు.)

నారదుడు

(మృదువుగా, ఓదారుస్తూ) అంత నిస్పృహ అక్కర్లేదు నాయనా ! నాకేం ఫర్వాలేదు. అసలు – నా భార్య ఏమన్నదో చెప్పు !

ప్రౌఢ వాల్మీకి

(కన్నీళ్ళు తుడుచుకొంటూ) భార్యను పోషించవలసిన బాధ్యత భర్తది. బాధ్యత నిర్వహించడంలో భర్త ఏం చేసినా భార్యకు సంబంధం లేదు, అన్నదామె. నా పాపం పంచుకోదట. పుణ్యం పంచుకుంటుందట ! అదికూడ అక్కరలేదు పొమ్మంది !

నారదుడు

(నవ్వుతూ) ఆమె సత్యమే చెప్పింది. స్త్రీ సంగతే అంత. కుమార్తెగా ఉన్నంతకాలం తండ్రి, భార్యగా ఉన్నంతకాలం భర్త. తల్లిగా ఉన్నంతకాలం కొడుకు ఆమె పాప పుణ్యాలకు బాధ్యులవుతారు. అందువల్లనే స్త్రీ పాపపుణ్యాలకు అతీతురాలు ! ఇదంతా నీకు అర్థం కాదుగాని - ఆమె సత్యమే చెప్పింది ! ఇప్పుడు నీకు కావలసిందేమిటి?

ప్రౌఢ వాల్మీకి

నాకిప్పుడు కావలసింది నీ పాద ధూళి ! (మళ్ళీ సాష్టాంగ పడతాడు. నారదుడు అతణ్ని లేవదీసి, కౌగలించుకుంటాడు.)

నారదుడు

నీవు ధన్యుడివి. నీకు మంత్రం ఒకటి ఉపదేశిస్తాను. దానిని జపించుకొంటూ, ఈ అరణ్యంలో ఎక్కడో, ఎవరూ తెలుసుకోలేని చోట కూర్చో ! ఏ పరిస్థితిలోనూ కదలకు ! నీ మీద పుట్టలు మొలిచినా, చెట్టులు మొలిచినా సరే లెక్క చెయ్యగూడదు. తెలిసిందా ?

ప్రౌఢ వాల్మీకి

(అంజలి ఘటించి) తెలిసింది.

నారదుడు

ఇదిగో మంత్రం ! (అతడి చెవిలో ఏదో చెపుతాడు)

ప్రౌఢ వాల్మీకి

(భక్తితో) మ-రా-?

నారదుడు

ఔను ! మ-రా-?

ప్రౌఢ వాల్మీకి

మరా - మరా - మరామరామ రామ రామరామ - (అక్కడే అలా కూర్చుండి పోతాడు - జపం చేసుకొంటూ)

నారదుడు

(ఆశ్చర్యంగా) ఓహో, ఇతడి ఏకాగ్రత ! ఇతడెవరో వరపుత్రుడు. కేవలం బోయ మాత్రుడు కాడు ! (ఆలోచించుకొని) నేను కూడ అలా చెప్పా నేమిటి! ఏవో నోటికి వచ్చిన రెండక్షరాలు అన్నాను ! అది అతడికి మంత్రమై అతణ్ని సమాధి స్థితుణ్ని చేసింది. దేనికైనా మనస్సు ప్రధానం ! గట్టి మనస్సుకు ప్రతి మాట ఒక మంత్రమే ! అంతా నారాయణుని చిద్విలాసం ! ఇతడు నన్ను కూడ మరచి, జపంలో తపంలో మునిగి పోయాడు. అద్భుతం !

(నారదుడు నారాయణ సంకీర్తన ప్రారంభిస్తాడు. తెర.)

# ఆదికవి వాల్మీకి

## అంకం అయిదు

(వాల్మీకి ఆశ్రమం. వాల్మీకి చుట్టూ రామపాదం, మరి కొందరు ముని కుమారులు కూర్చుని ఉన్నారు. అందరూ రామనామ జపంలో ఉన్నారు. ఈ లోపల అంతవరకు జరిగిన విషయాలు లోపలినుంచి సామాజిక లోకానికి వినిపిస్తూ ఉన్నై.)

నేపథ్యవాణి

భరద్వాజ మహర్షి తన తపోబలంతో చూపిన ప్రదర్శన ద్వారా వాల్మీకి గత చరిత్ర లోక విదిత మయింది. ఒక మహా చండాలుడు మహా ఋషి అయినాడు. మరా – రామ అయింది. భరద్వాజు డంతటి మహా తపోధనుడే సశిష్యంగా వాల్మీకికి ప్రధాన శిష్యుడైనాడు. తాను తపస్సు చేసిన పుట్టనే ఆసనంగా చేసుకుని, ఆ అరణ్యమే తన ఆశ్రమంగా, వేలకొలదీ శిష్యులు సేవించగా తపోవృత్తిని చేపట్టాడు వాల్మీకి. జరిగిన తారుమారు ఏమిటో అర్థమయింది వాల్మీకికి. కాని – నారదుడు చెప్పిన ఏదో విషయం ఇంకా అవగాహన కాలేదు. ఇలా చాలాకాలం గడిచింది. ఒకనాడు ఉదయ కాల విధుల కోసం యధారీతిగా బైలుదేరాడాయన శిష్యులతో కలిసి తమసా నదికి.

(జపం చాలించి అందరూ లేస్తారు. శిష్యులు అటూ ఇటూ నిష్క్రమిస్తారు.)

రామపాదం

గురుదేవా ! బ్రహ్మ ముహూర్తంలోనే అరుణోదయమై, బాల సూర్యుడు నడి నెత్తికి వచ్చి –

వాల్మీకి

(ఆశ్చర్యంగా) ఎప్పుడు ?

రామపాదం

నేటి వేకువ జామున !

వాల్మీకి

(చిరునవ్వుతో) ఓహో - స్వప్నమా !

రామపాదం

స్వప్నం కాదు, నిజమే ! మొత్తం ఆశ్రమ వాసులంతా ఇదే విచిత్రాను భవంతో, కంగారుగా లేచి కూర్చున్నారు. తీరా చూస్తే - ఆ కాంతి మీ ముఖబింబానిది! అటువంటి అపూర్వ తేజస్సును ఎవరూ, ఎప్పుడూ చూచి ఉండ లేదని భరద్వాజులు కూడ అన్నారు.

వాల్మీకి

(ఆలోచనలో పడి) ఆహాఁ ! (ఇద్దరూ ముందుకు నడుస్తారు.)

వాల్మీకి

రామపాదం ! ఈ ప్రకృతి ఎంత శోభాయమానంగా ఉందో చూడు ! రోజూ ఇలా లేదు ! ఈ వృక్షలతాదులు, ఈ పశు పక్ష్యాదులు, ఈ గిరినిర్ఝరాదులు చక్కగా అలంకరించుకొని, పారవశ్యంతో రామనామం గానం చేస్తున్నై ! (హర్షపులకిత గాత్రుడై చుట్టూ చూస్తూ) నీకు వినిపించడం లేదా?

రామపాదం

ఎందుకు వినిపించడం లేదు ? మీ కంఠం ద్వారా వినిపించడమే కాదు, మీ హర్ష పులకిత దేహం ద్వారా స్పష్టంగా కనిపిస్తున్నై !

వాల్మీకి

(తన్మయత్వంతో) ఈనాడెందుకో పరమానందంగా ఉంది !

రామపాదం

అంతవరకూ అలానే ఉంది. ప్రకృతి ఎంతో ఆత్మీయంగా ఉంది. (హఠాత్తుగా ఆగి) మనం దారి తప్పి నడుస్తున్నాం !

వాల్మీకి

(ఎదరకు చూచి) అదే కదా తమసానది !

రామపాదం

కాని - ఈ దారి జంతువులు, వేట గాండ్రు కూడ పోలేనంత దుర్గమం!

వాల్మీకి

ఫర్వాలేదులే, నడు ! ఈరోజు క్రొత్తదారి త్రొక్కుదాం.

(ఇద్దరూ ఒక ప్రక్కకు నిష్క్రమించగా, రెండో ప్రక్క నుంచి విల్లమ్ములు ధరించిన ఒక నిషాదుడు ప్రవేశిస్తాడు. కేవల కౌపీన మాత్రుడు. పిట్టల కోసమూ, జంతువుల కోసమూ వెతుకుతూ, పొంచి పొంచి అడుగులు వేస్తూ పరిక్రమిస్తా డతడు. హఠాత్తుగా ఒక చెట్టుమీద ఏదో చూస్తాడు. నక్కి నక్కి జరుగుతూ, విల్లెక్కుపెట్టి బాణం వదులుతాడు. కీచుమన్న ధ్వని పిట్టల అరుపు. రెక్కల రెపరెప. ఒక పిట్ట మూలుగు. మరోపిట్ట ఏడుపు. ప్రకృతి నిండా విషాదం. లోపలినుంచి "మానిషాద" - అంటూ ఒక కోప కంఠం వినిపిస్తుంది. నిషాదుడు నిలబడిపోయి, అటుకేసి దిగ్భ్రాంతుడై చూస్తాడు. అటునుంచి కోపావేశంతో వాల్మీకి. ఆ వెనుక విభ్రాంతుడైన రామపాదం ప్రవేశిస్తారు.)

వాల్మీకి

**మా విషాద ప్రతిష్ఠాం త్వం**
**అగమ శ్శాశ్వతీ ! సమా !**
**యత్ క్రౌంచ మిధునా దేశం**
**అవధీః కామ మోహితం !**

(శ్లోక రూపమైన ఈ శోక బాషణం వాల్మీకి నోటి నుంచి వెలువడిన తక్షణం, మొదలు నరికిన తరువులా నిషాదుడు కూలి, అవతలికి పడిపోతాడు. వాల్మీకిలోకి

గంభీరత ఏదో వచ్చి చేరింది. ప్రకృతి కూడ గంభీరముద్ర వహించింది. ఇదంతా దూరం నుంచి చూస్తున్నవాళ్ళలా శిష్యులు బిలబిల మంటూ వాల్మీకి చుట్టూ చేరారు.)

రామపాదం

ఎంత అద్భుతంగా ఉంది ! ఎంత లయ బద్ధంగా ఉంది ! ఎంత శ్రావ్యంగా ఉంది ! అంతేగాక, అందులో ఏదో రహస్యార్థం ఉన్నట్టుంది!

(అందరూ ఆలోచనలో పడతారు. ముందుకు నడుస్తూ ఉంటారు.)

వాల్మీకి

అవును ! నా అంతరాంతరాలలోని ఏదో ఒక రహస్య ద్వారం భళ్ళున తెరచుకొన్నట్టయింది ! నా హృదయ దళాల క్రింది ఏదో ఒక మహతి ఖంగున మ్రోగి నట్టయింది ! నా చిదాకాశం నుంచి ఏదో ఒక విషాద మేఘం బ్రద్దలై నన్ను నన్నంతా రసవృష్టిలో ముంచేసి నట్టయింది !

రామపాదం

అవును ! అవును ! ఆ దివ్యదృశ్యాన్ని మేమంతా కళ్ళారా చూశాం ! చెవులారా విన్నాం !

వాల్మీకి

(జ్ఞాపకం తెచ్చుకొంటూ) ఏమిటది? ఏమన్నాను ?

రామపాదం

అది మా అందరకూ ప్రతి అక్షరమూ జ్ఞాపకం ఉంది !

(అందరూ "మానిషాద" అంటూ, ఒక లయలో చదువుతారు.)

వాల్మీకి

(నిట్టూర్చి) పాపం ! ఆ క్రౌంచ మిధునం !

రామపాదం

ఆశ్రమానికి వచ్చేశాం ! గురుపాదు లింకా శోకం నుంచి తేరుకోలేదు!

(శిష్యులు వారి వారి పనుల మీద పోతారు. వాల్మీకి అలానే దుఃఖంతో, ధ్యానముద్ర వహించి నిలబడి ఉంటాడు. రామపాదం ఏమీ తోచక దిక్కులు చూస్తాడు. అప్పుడు ఒక మెరుపువలె బ్రహ్మ ఆశ్రమంలో ప్రవేశిస్తాడు. వాల్మీకి అభివాదం చేస్తాడు. బ్రహ్మ ఆశీర్వదిస్తాడు.)

బ్రహ్మ

కవీ ! మనీషీ ! మహర్షీ !
కామ మోహితమై యున్న క్రౌంచయుగళి
నడుమ నెడబాటు కల్పించి నట్టి దుష్టు
డపుడె నష్ట ప్రతిష్ఠుడై అంతరించె !
ఇంక నేమిటి కిట్లు శోకింతు వీవు ?

వాల్మీకి

(అంజలి ఘటించి) చాతురాస్యా ! జగత్పితా !
క్రౌంచములు పోయె, పోయె కిరాతకుండు ;
కాని – తద్దుర్ఘటన నుండి కల్గినట్టి
దుఃఖమేలనొ ననువీడి తొలగిపోదు ?
తనువుతో పోని కర్మంపు తగుల మట్లు !

అదియు కూడ అలలు అలలుగా చెలరేగి,
ఉదధి వోలె ఉబికి ఉబికి వచ్చు !
శోకమునకు ఇంత లోకమేలెడు శక్తి
ఎవరి వలన కలిగె? ఏల కలిగె ?

భార్గవుడను నేను, ప్రాచేతనుడ నేను,
బ్రహ్మసుతుడ నేను, బ్రహ్మ నేను ;
నిన్ను గనుట నన్ను నే జూచుటయె; కాని -
చూడ రానిదయ్యె శోక శక్తి !

ఇంత దుఃఖము నీవె సృష్టించినావొ ?
సృష్టియే ప్రతి సృష్టి చేసికొనినదియొ ?
చావు బ్రతుకులలో ఏది సత్య మగునొ ?
తండ్రి ! నీ సృష్టి తప్పుల తడక కాదొ ?

బ్రహ్మ

(వాత్సల్యంతో కూడిన చిరునవ్వు నవ్వుతూ) కుమారా ! నీ ధైర్యానికీ, నీ పరిశీలనా శక్తికీ, నీ ప్రతిభా ప్రాభవానికీ నేను అమందానంద కందళిత హృదయార విం-దు-డ-నై- (కంగారు పడతాడు)

వాల్మీకి

(చిరునవ్వుతో) తండ్రీ ! గతాన్ని స్మరించ వద్దు. నా గతం నాకు తెలుసు. నీ గతం నీకూ తెలుసు ! నీవు పంది మొదలు పరమేశ్వరుడి వరకూ సృష్టించిన బ్రహ్మవు. నేను పందినీ, పరమేశ్వరుణ్నీ ఒకే ఆత్మదృష్టితో చూసే ఋషిని ! నాకు గతంతో పనిలేదు. భవిష్యత్తు మాటేమిటి? మానవుడి గతి ఏమిటి?

ఎంత బ్రాహ్మణుడవొ నీవు, అంత పంచ
ముడవు; ఎంత గొవువొ, అంత ఉడుము వీవు !
నాకు వలసిన దది కాదు; నరు డెవండు?
మానవుడు తరియించెడి మార్గమేది ?

బ్రహ్మ

(ఇరకాటంలో పడి, నాలుగు ముఖాలలోను నాలుగు రకాలైన భావాలు ఉత్పన్నం కాగా, ధైర్యం చిక్కబట్టి, ఇక సత్యం చెప్పక తప్పదన్నట్టు ఏక ముఖుడై-)

నీవు చండాలుడవు కాన, జీవ సత్య
మింత కటువుగా తెలిసికో నెంచినావు !
చావు బ్రతుకులలో నేది సత్యమన్న -
చావు సత్యము ! బ్రతుకును సత్య మగును !

సరస చైతన్య వీచికా శరధిలోన
వీచి పుట్టి, లేచి, పెరిగి, విరిగి పడుట
బాల్య యౌవనాదిక జీవ్యవస్థ లగును !
జీవి తృణమాత్ర మీ విశ్వ సృష్టిలోన !

మనుజుడన నెంత ఈ విశ్వమానసమున ?
ఈ యనంతములో వాని ఆయు వెంత ?
ఐనగాని - ఆ క్షణము పాటైనగాని
బ్రతుక వలయును కాదె పూర్ణముగ నతడు !

క్రౌంచ కామినీ ప్రియగ తా క్రందనము న
చమ్ములై నిన్ను ముంచెను శోకరసము !

శోకమును లోకమును కూడి శ్లోకమయ్యె !
శ్లోక మది నిన్ను కూడి సుశ్లోకమయ్యె !

భువి ననుష్టుప్పు నీకు తోబుట్టు వగుట
అదియు అష్టాక్షరీ బ్రహ్మహృదయ అగుట,
దాని లయ జానకీ చరిత్రాంశ యగుట
మహిని వెలయింపు మీవు రామాయణమ్ము !

రాముడనగ ఆత్మ; రావణుండు అనాత్మ;
అవని జాత దుండె; హనుమ మనసు;
ఆత్మ త్యాగ నిరతి నంతిమ విజయమ్ము
చేత గొన్న చరిత సీత చరిత !

మనసు భక్తుడయ్యె; మాలిన్య మంతయు
వీగిపోయె; ఆత్మవిజయు దయె;
ధర్మ పాలనమున ధరణీజమౌ గుండె
విచ్చిపోయి కూడ విజయ మందె !

నారదుడు నీకు వినిపించి నాడు నాడు ;
తలచుకొమ్మది రామావతార గాథ !
రాముడే పురుషుడు; సీత ప్రకృతి యౌను !
ప్రణయ ధర్మాల మధ్య పోరాట మిద్ధి !

మానవుని దానవుని నుండి మనుచు కొరకు
అవనిలో ఉద్భవించిన కవివి నీవు !

**పరమ సూక్ష్మమ్ము కావలె ప్రతి వచనము !**
**దాశరథి గెల్పుమించు సీతమ్మ గెల్పు !**

**ఆత్మ తనను తా నెరిగిన ఆ క్షణాన**
**తానె పరమాత్మ యౌచు, తత్త్వమని యౌను;**
**పూర్ణ మోక్షమ్ము శూన్యమ్ము ! భువి ఇకేది?**
**సృష్టి కంతకు ముఖ్యమ్ము సీత మమ్ము !**

అందువలన, పుత్రకా ! నీవు రామాయణం వ్రాయి ! సీతారామ చరిత్రను - జరిగింది జరిగినట్టు - నీవు దర్శించగలవు. ఆదర్శ పురుషుడు రాముడు! అతడి ఆదర్శం భూలోకాన్ని ఉద్ధరించగలదు. నాలుగు వేదాలూ నీ కవితలో కరిగి ప్రవహించ గలవు. వేదాల సర్వ సమానీ ధర్మం నీ కావ్య నాయకుడిలో రూపు దాల్చ గలదు - సర్వమానవ సమానత్వం, ఆదర్శ పూర్ణ పురుషత్వం నీ కావ్యం ప్రదిపాదించ గలదు. మానవుణ్ని ఉద్ధరించడానికి దే నా కడపటి ప్రయత్నం. మానవుడెలా ప్రవర్తిస్తే - జగత్తు ఆనందప్రద మవుతుందో నీవు తీర్చిదిద్ది చూపు ! నీవు విజయుడ వగుదువ గాక !

(బ్రహ్మ నిష్క్రమిస్తాడు. వాల్మీకి అంజలి ఘటించి నిమీలిత నేత్రుడై అలా ఉండి పోతాడు. అప్పటికే అక్కడికి వచ్చి ఉన్న భరద్వాజాది శిష్యులు కూడా అలానే అవనత శిరస్కులై ఉండిపోతారు. మెల్లగా - తెర)

# ఆదికవి వాల్మీకి

## అంకం ఆరు

(వాల్మీకి ఆశ్రమం. రంగం రంగు రంగుల కాంతులతో ఉజ్వలంగా ఉంది. ఆది కావ్యం రామాయణ తయారవుతున్న సారస్వత గర్భంలా ఉన్నది. ఆ రంగుల రంగంలోకి రామపాదం ప్రవేశించాడు – ఆనందంతో ఆదికవి వాల్మీకిని స్తుతించుకొంటూ)

రామపాదం

కూజంతం రామ రామేతి
మధురం మధురాక్షరం
ఆరుహ్యా కవితా శాఖాం
వందే వాల్మీకి కోకిలం !

వాల్మీకే ర్ముని సింహస్య
కవితా వనచారిణః
శృణ్వన్ రామ కథానాదం
కోన యాతి పరాం గతిమ్

యః పిబన్ సతతమ్ రామ
చరితామృత సాగరం
అతృప్త స్తం మునిం వన్దే
ప్రాచేతస మకల్మషమ్

వేద వేద్యే పరే పుంసి
జాతే దశరదాత్మజే

వేదః ప్రాచేతసా దాసీత్
సాక్షాత్ రామాయణాత్మనా !

వాల్మీకి గిరి సంభూతా
రామ సాగర గామినీ
పునాతు భువనం పుణ్యా
రామాయణం మహానదీ

గోష్పదీ కృత వారాశిం
మశకీ కృత రాక్షసం
రామాయణ మహామాలా
రత్నం వందే అనిలాత్మజం.

ఓహో ! రామాయణ మహాకావ్యం ! జరిగింది జరిగినట్టు మనః ఫలకంపై దర్శిస్తూ, దర్శించింది దర్శించి నట్టు లయబద్ధం చేస్తున్నాడు మహాకవి !

ఆశ్చర్య మిద మాభ్యాసం
మునినా సంప్రకీర్తితం
చిర నిర్వృత్త మప్యేతత్
ప్రత్యక్ష మివ దర్శితం

ఇతి వృత్తమూ ఆశ్చర్యకరమే. రచనా పద్ధతీ ఆశ్చర్య కరమే. ప్రతి శ్లోకమూ ఒక మంత్రమే. ప్రతి అక్షరమూ ఒక అమృత కలశమే. ఓహో ! గురుదేవా ! వాల్మీకి కవి చంద్రా ! మానవ లోకాన్ని ఉద్ధరించడానికి శ్రీరాముడితోపాటు అవతరించిన ఆత్మారాముడివయ్యా ! నీవు !

(అంతలో రామాయణ శ్లోకాలను గానం చేసుకొంటూ, తదేక ధ్యానంతో వాల్మీకి ప్రవేశిస్తాడు.)

వాల్మీకి

తత్ర సీతా మయా దృష్టా
రావణాంతః పురే సతీ
సం న్యస్య త్వయి జీవంతి
రామా రామ మనోరథం

దృష్టా మే రక్షసీ మధ్యే
తర్జ్యమానా ముహుర్ముహుః
రాక్షసీభి ద్విరూపాభీ
రక్షితా ప్రమదావనే

దుఃఖ మాపద్యతే దేవీ
తవా దుఃఖోచితా సతీ
రావణాంతః పురే రుద్దా
రాక్షసీభిః సురక్షితా

ఏక వేణీ ధరా దీనా
త్వయి చింతా పరాయణా
అధః శయ్యా వివర్ణాంగీ
పద్మినీ వ హిమాగ మే !

(అశోక వనంలోని సీత దైన్యానికి సంబంధించిన ఈ శ్లోకాలనే మరీ మరీ అనుకొంటూ, ఆ దైన్యాన్నంతా తానే అనుభవిస్తున్నట్టు వాపోతూ, కాలకృత్యాల నిమిత్తం వాల్మీకి ముందుకు నడుస్తూ ఉంటాడు. రామపాదం అతణ్ని అనుసరిస్తాడు. కొంతదూరం నడిచిన తర్వాత, రామపాదం ఆశ్చర్యంగా దూరంలోకి ఆగుతాడు.)

రామపాదం

గురుదేవా ! మీరిప్పుడనుకొంటున్న శ్లోకానికి అధిదేవతయైన అశోకవనంలోని సీతాదేవి వలె, మూర్తీభవించిన ఎవరో ఒక శోకదేవత – అదిగో – (ఎదరకు సూచిస్తూ) అదిగో, ఆ నదీ తీరస్థ శిలాఖండంపై నిల్చి –

వాల్మీకి

(అటు చూచి, కంగారుగా) ఓహో ! ఎవరో శోకదేవత – ఏదో అఘాయిత్యానికి పాల్పడ బోతూ ఉంది – (ఎలుగెత్తి) అమ్మా ! అమ్మా ! అమ్మా !

(వాల్మీకి అటుకేసి పరుగు పరుగున నిష్క్రమిస్తాడు. ఏమి చేయాలో తెలియని కంగారుతో కాళ్ళు త్రొక్కు కుంటాడు – రామపాదం. వాల్మీకి మహర్షితో పరిగెత్త బోతాడు. పరిగెత్త లేక ఆగపోతాడు. అటు పార జూస్తాడు.)

రామపాదం

అమ్మో ! నదిలో దూకేస్తోంది. ఆమె ! ఆ ! ఆ! ఓహో ! రామా ! నీ లీలలు !

**ఆపదా మప హర్తారం**
**దాతారం సర్వ సంపదాం.**
**లోకాభి రామం శ్రీరామం**
**భూయో భూయో భజామ్య హం !**

(అంజలి ఘటించి, మళ్ళీ అటు చూచి) ఓహో ! గురుపాదుల కేకకు ఆమె తిరిగి చూచింది ! కొండ కొమ్ము నుంచి దిగి వచ్చేస్తోంది ! ఎంతలో ఎంత గండం తప్పింది ! గురుపాదులకు నమస్కరిస్తోంది ! అచ్చంగా అశోక వనంలోని సీతలాగే ఉంది ! గర్భిణిలా ఉంది ! ఓహో ! ఈ తల్లిని కళ్లార చూడడమే జన్మకు సాఫల్యంలా ఉంది ! తల్లీ ! నీ వెవరవో గాని – నాకు మాత్రం సాక్షాత్తు సత్య సుందర శివంకరీ మూర్తివి ! ముక్తీశ్వరివి ! గాయత్రీ దేవివి ! చైతన్య శక్తివి !

(రామపాదం సాష్టాంగ పడతాడు. అప్పుడు అదే దిక్కు నుంచి సీత, వాల్మీకి ప్రవేశిస్తారు. సీత శోకగ్రహణం పట్టిన సహజ సుందర శారద చంద్రబింబం. వాల్మీకి రామపాదాన్ని లేవనెత్తుతాడు. రామపాదం వారిద్దరి పాదధూళిని శిరమున గ్రహించి, ప్రక్కకు తొలుగుతాడు. సీతాదేవి పరమ గంభీరంగా ఉంది. వాల్మీకి మహర్షి మాటి మాటికీ కళ్ళొత్తుకుంటున్నాడు. వాస్తవంగా ఏడుస్తున్నాడు.)

**వాల్మీకి**

(రుద్ధకంఠంతో) తల్లీ ! జానకీ ! నేనింకా బ్రతికి ఉండడం నిన్నీ అవస్థలో చూడడాని కేనా – అమ్మా ? (కళ్లొత్తుకుంటాడు.)

**సీత**

తండ్రీ ! నీ వెవరైనా సాక్షాత్తు నా తండ్రివే ! నా జీవిత కల్లోలినిలో – ఏనాడూ కట్ట తెగని నా దుఃఖం ఈనాడు నీ సన్నిధిలో ఉప్పెనలా పొంగి వస్తున్న దెందు వల్లనో ! తండ్రీ ! నన్నొక్కసారి ఏడవనీ !

(సీత వాల్మీకి పాదాలపై పడి వెక్కి వెక్కి విలపిస్తుంది. వాల్మీకి కన్నులు గౌతమీ వసిష్ఠ లైనై ! అతడలానే సీతాదేవి శిరస్సుపై చేయి ఉంచి నిలబడి పోయాడు ! ఇర్వురి కన్నీరూ ఒక మహా కరుణ కావ్యంవలె కలిసి ప్రవహిస్తోంది! అలా ఎంత సేపో యేమో)

**వాల్మీకి**

అమ్మా !

**సీత**

(తేరుకొని, లేస్తూ) తండ్రీ !

వాల్మీకి

నీవు జగన్మాతవు, తల్లీ !

సీత

(ఏడ్పు నవ్వుతో) నన్ను నేను మరచిపోలేదు, తండ్రీ !

వాల్మీకి

(స్వగతంగా) నిన్ను నీవు మరచిపోతే, ఇక జ్ఞాపకం అనేదేమున్న దమ్మా? ఈ మహావిశ్వం సర్వం క్షణకాలంలో నాశనం కాలేదంటే – నీ వింకా తెలివిగా ఉన్నావనే అర్థం ! తల్లీ !

సీత

తండ్రి !

వాల్మీకి

తల్లీ !

(క్షణకాలం పాటు మౌనం. సీతకు మళ్ళీ దుఃఖావేశం)

వాల్మీకి

ఇదే మన ఇద్దరి మధ్యా ఒప్పందం. నా ఆశ్రమం నీకు పుట్టిల్లు. నీ చరిత్ర ఒక మహా కరుణకావ్యం. దానికి తండ్రిని నేను. నా శిష్యులు నీ చరిత్రను గానం చెయ్యగలరు. దానిని వింటూ నిన్ను నీవే వింటూ, సమస్త గతాన్నీ మరచి– నీ తండ్రి ఇంట నీవు సుఖంగా ఉండు !

సీత

సమస్త గతాన్ని మరిచా ? నా స్వామిని కూడ మరిచా?

వాల్మీకి

(సాలోచనగా) స్వామి!

సీత

ఔను ! స్వామి ! నా స్వామి ! నీ స్వామి ! సమస్త విశ్వానికీ స్వామి!

వాల్మీకి

(ఆనందంతో) మరవా లన్నా మరపురాని స్వామిని, మరపు కూడా తన రూపమే అయిన స్వామిని – ఎలా మరుస్తాం, తల్లీ? నే నన్న మరపు అది కాదమ్మా ! దుఃఖం మరచి పొమ్మంటున్నాను.

సీత

(నిట్టూర్చి) దుఃఖం ఎలా మరవడం, తండ్రీ ? నేనే దుఃఖం ! నా జీవిత చరిత్రే ఒక దుఃఖ చరిత్ర ! అన్నిటికంటె, భర్తచే పరిత్యజించ బడ్డ భార్యగా మానవ సహజమైన దుఃఖం నన్నెక్కువగా పీడించి చంపుతోంది, తండ్రీ! అంతకు మించి ఆలోచించ లేక పోతున్నాను. ఈ నా దుఃఖాన్ని దలచుకొంటూ నా స్వామి కూడ ఎంత దుఃఖ పడుతున్నాడో అనే తలంపు మనస్సుకు తగిలినప్పుడెల్లా నా వేదన – (కంఠం రుద్ధమై పోతుంది)

వాల్మీకి

(ఆకాశంలో? చూస్తూ, అంజలి ఘటించి) ప్రభూ !
ఎందు పోయెను క్రౌంచముల్ ? ఎందు పోయె
వ్యాధుడున్? అందు ఇందు సర్వత్ర అదియె
కాతర ధ్వని ! అదియె దుఃఖాశ్రు ధార !
శోకమే లోకమో ! మరి సుఖమె లేదొ !

(సీతతో) జీవికి సహజమైనట్టిది శోకమే, తల్లీ! నీవు లోక మాతవు కాబట్టి, లోక శోకాన్నంతా నీవు భరించవలసి వచ్చిందమ్మా, భూపుత్రీ!

**లోక మాతవు కావున, లోక శోక**
**మెల్ల నీ యందె వచ్చి చేరినది, తల్లి !**
**శోకమును నీవె లో నిముడ్చుకొని, ఎల్ల**
**పృథ్వి కొసగు మశోక నిశ్రేయసమ్ము !**

సీత

(బరువుగా) నా హృదయం చెపుతున్న దదే, తండ్రీ! కాని, దేహం మాత్రం ఒక భరించ లే నంటున్నది! దీనిని త్యజించాలన్న నిర్ణయానికి వచ్చే క్షణంలోనే నీ పిలుపు వినిపించింది ! నా గర్భస్థ శిశువు పిలుపే అమ్మా అంటూ ప్రకృతిలో ప్రతిధ్వనించిందనుకొన్నాను. అంత ఆర్ద్రంగా అమ్మా అని నన్ను పిల్చే వాళ్ళు నాకు లోకంలో ఎవరున్నారు !

(కన్నీరు బొట బొట రాలుతుంది.)

వాల్మీకి

(కళ్ళొత్తుకుంటూ) లోకం ఎంత విచిత్రమైంది ! జనక మహారాజు కూతురు, దశరథ మహారాజు కోడలు, శ్రీరామచంద్రుని అర్ధాంగి, మహారాణి, పతివ్రత, లోకమాత, సీత! లోకాన్నే ఓదార్చే తల్లికి ఓదార్పు కరవై పోయింది కదా! ఆశ్చర్యం! (సీతాదేవితో) తల్లీ ! దుఃఖాన్ని స్మరించుకునే కొలదీ అగాధంలోకి దిగబడి పోవడమే అవుతుంది. అదంతా మరచిపో, అమ్మా ! నీ గర్భంలో రామతేజం ఉంది. నీ మహనీయ చరిత్ర లోకంలో ప్రతిష్ఠించ బడడానికి ఆ తేజం అవసరం. నీవు దుఃఖించే కొలదీ నీ రామకథ దుఃఖమయం అయిపోగలదు. నీ పుట్టిల్లిది. ఇక ఊరడిల్లు, అమ్మా! అదిగో మనవాళ్ళు కావ్యగానం చేస్తున్నారు !

(లోనుంచి రామాయణ గానం వినిపిస్తుంది.) నీ కథాగానమే నీవు వింటూ ఊరడిల్లు ! నీ కథాగానం లోనే నీవు లీనమైపోయి ఆనందించు !

సీత

(పరధ్యానంగా) నేను ఊరడిల్లేది నా తల్లి భూదేవి ఒడిలోనే. తండ్రి అయినా, రామకథా ప్రతిష్ఠకోసం రాజతేజం అవసర మన్నావు కనుక, అంతవరకు ఇక్కడ ఉంటాను. రాముడు నన్ను వదిలేసినా, నేను రాముణ్ని వదలలేను కనుక - రామ కథాగానం వింటూ రాముడిలోనే లయమై పోతాను.

(అంతలో రామాయణం పాడుకొంటూ రామపాద౧ వగైరా ముని కుమారులు ప్రవేశిస్తారు.)

(సీత అశోక వనంలో ఉన్నప్పుడు ఆమెను హనుమంతుడు దర్శించి, శ్రీరాముని సీతా వియోగ దుఃఖాన్ని ఆమెకు వర్ణించి చెప్పే సుందర కాండ కావ్య భాగ మది. అది వింటూ ఉన్నప్పుడు సీతాదేవి కపోలాలు నిత్య స్రవంతులుగా ఉంటై. వాల్మీకి కూడ శిష్యులతో పాటు గానం చేస్తాడు.)

రామపాదం వగైరా

తాని రామాయ దత్తాని
మయై వోవ హృతాని చ
స్వనవ స్న్యవకీర్ణాని
తస్మిన్ విగత చేతసి !

తాన్యంకే దర్శనీయాని
కృత్వా బహు విధం తవ

తవ దేవ ప్రకాశేన
దేవేన పరిదేవితం !

పశ్యత స్తాని రుదత
స్తామ్యతశ్చ పునః పునః
ప్రాదీపయన్ దాశరధే
స్తాని శోక హుతాశనం !

సత వాదర్శ నే నార్యే
రాఘవః పరితవ్యతే
మహతా జ్వలతా నిత్యం
అగ్ని నే వాగ్ని పర్వతః

త్వదృతే త మనిద్రాచ
శోకశ్చింతాచ రాఘవం
తాపయన్తి మహత్మాన
మగ్న్య గార మివాగ్నయః

తవాదర్శన శోకేన
రాఘవః పరిచాల్యతే
మహతా భూమి కంపేన
మహా నివ శిలోచ్ఛయః

(ఇలా గానం సాగిపోతూ ఉంటే, గతమంతా మళ్ళీ కళ్ళ ముందు మెదలగా, ఇనుమడించిన శోకంతో సీత తుఫానులో తీగవలె జవజవలాడి పోయింది. ఆమెను మృదువుగా పట్టుకుంటాడు వాల్మీకి. మెల్లగా తెర జారుతుంది. తెరలోపలి నుంచి గానం వినిపిస్తూనే ఉంటుంది.

నేపథ్యవాణి

వై దేహీ సహితం సురద్రుమతలే
హైమే మహా మండపే
మధ్యే పుష్పక మాసనే మణిమయే
వీరాసనే సుస్థితం
అగ్రే వాచయతీ ప్రభంజన సుతే
తత్వం మునిభ్యః పరం
వ్యాఖ్యాన్తం భరతాదిభిః పరివృతం
రామం భజే శ్యామలం !
యః కర్ణాంజలి సంపుటై రహ రహః
సమ్యక్ పిబత్యాదరాత్

వాల్మీకే ర్వద నారవింద గలితం
రామాయణాఖ్యం మధు
జన్మవ్యాధి జరావివత్తి మరణైః
అత్యంత సోపద్రవం .
సంసారం స విహాయ గచ్ఛతి పుమా
న్విష్ణోః పదం శాశ్వతం !

* * *